# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 116 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | సోమవారం 16 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 116 16-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## 20న ఏపీ తెలంగాణ బంద్
### పిలుపు ఇచ్చిన మావోయిస్ట్‌లు



**హైదరాబాద్ జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ.. ఈ నెల 20న ఏపీ తెలంగాణ రాష్ట్రాల బంద్‌కు మావోయిస్టు నేతలు పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాల బంద్‌కు ప్రజలు సహకారం అందించి

- తరువాయి 2లో..

# మరో ఘోర ప్రమాదం..
## హెలికాప్టర్ కుప్పకూలి ఏడుగురు మృతి

- కేదార్‌నాథ్ నుంచి గుప్తకాశీకి వెళ్తుండగా కూలిన హెలికాప్టర్
- మృతుల్లో 23 నెలల చిన్నారి
- గౌరీకుండ్ వద్ద దట్టమైన అడవిలో ప్రమాదం
- ప్రతికూల వాతావరణమే కారణమని ప్రాథమిక అంచనా
- కొనసాగుతున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు
- కేదార్ ఆలయం తెరిచాక ఇది ఐదో విమానయాన ఘటన





**ఉత్తరాఖండ్, జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విషాదకర ప్రమాదం మరవకముందే మరో ఘోర ప్రమాదం జరిగింది. హెలికాప్టర్ కుప్పకూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకుంది. ఆర్యన్ కంపెనీకి చెందిన హెలికాప్టర్.. ఆదివారం ఉదయం డెహ్రాడూన్ నుండి కేదార్‌నాథ్ వెళ్తుండగా గౌరీకుండ్ అడవుల్లో కుప్పకూలినట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ప్రమాదం జరిగిన

- తరువాయి 2లో..


## అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 32 మంది మృతదేహాల గుర్తింపు పూర్తి..
### 13 కుటుంబాలకు అప్పగింత

**డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించిన అధికారులు**
**ఇప్పటివరకు 13 మృతదేహాలు వారి కుటుంబ సభ్యులకు అప్పగింత**
**ప్రమాదంలో గాయపడిన 13 మందికి ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స**
**మృతదేహాల గుర్తింపు ప్రక్రియలో ఫోరెన్సిక్ బృందాల నిరంతర కృషి**

**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 32 మందిని డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్టు సివిల్ ఆసుపత్రి అధికారులు

- తరువాయి 2లో..





## మాజీ సీఎం విజయ్ రూపానీ మృతదేహం గుర్తింపు

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మృతి**
**మూడు రోజుల తర్వాత డీఎన్ఏ పరీక్ష ద్వారా మృతదేహం గుర్తింపు**
**రూపానీ కుటుంబ సభ్యుల డీఎన్ఏతో సరిపోలిన నమూనాలు**
**మొత్తం 32 మంది మృతుల డీఎన్ఏ నమూనాలు సరిపోలినట్లు వెల్లడి**
**తీవ్రంగా కాలిపోవడంతో మృతదేహాల గుర్తింపులో జాప్యం**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర విమాన ప్రమాదంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటన జరిగిన మూడు

- తరువాయి 2లో..



## ఆంధ్రప్రదేశ్‌లో 'యోగా'డే
### ప్రధాని మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారు

**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** యోగా వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఈ నెల 20వ తేదీన విశాఖ రానున్నారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని మోదీ విశాఖలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యోగా వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఈ నెల 20వ తేదీన విశాఖ రానున్నారు. ఈ మేరకు అధికారిక షెడ్యూల్ విడుదల అయింది. ఆ రోజు సాయంత్రం 6.50 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడ నుంచి నౌకాదళ గెస్ట్ హౌస్‌కి వెళ్లి రాత్రి బసచేస్తారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 6.30 నుంచి 7.45 వరకు విశాఖ ఆర్కే బీచ్‌లో నిర్వహించే యోగాసనాల్లో పాల్గొంటారు. కార్యక్రమాలు ముగిసిన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీకి తిరుగు పయనమవుతారని సమాచారం. ప్రధానితోపాటు 5 లక్షల మంది యోగా చేసేలా విశాఖలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి వెయ్యి మందికి ఒక బ్లాక్ ఏర్పాటు చేసి, ఒక యోగా శిక్షకుణ్ని

- తరువాయి 2లో..

## రండి... మీరూ పాల్గొనండి
### : సీఎం చంద్రబాబు

**ఈ నెల 21న విశాఖలో 'యోగాంధ్ర' కార్యక్రమం**
**ముఖ్య అతిథిగా హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ**
**సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రజలకు ఆహ్వానం**
**యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపు**
**కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు**



**విశాఖపట్నం జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** విశాఖలో ఈ నెల 21న 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో 5 లక్షల మందితో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏపీలోని కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో, యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు సోషల్ మీడియాలో స్పందించారు. "ప్రపంచానికి భారత దేశం ప్రసాదించిన దివ్య వరం%ొ% యోగ. ఆరోగ్యాన్నే కాకుండా ఆయుష్షును పెంచే యోగ మన జీవన విధానం కావాలి. ఈ నెల 21న విశాఖపట్నంలో 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ గారు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. రండి.. మీరు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనండి. యోగాను జీవితంలో భాగం చేసుకుందాం' ఆరోగ్యంగా జీవిద్దాం" అని చంద్రబాబు పేర్కొన్నారు. "ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరం. ప్రపంచానికి భారత్

- తరువాయి 2లో..



## డీఎస్సీ పరీక్ష తేదీల మార్పు..

**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షల తేదీలను మార్పు చేస్తున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణా తెలిపారు. యోగా డే సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో పరీక్షల తేదీలను మార్చినట్లు ఆయన వివరించారు. ఆ అభ్యర్థులకు జులై 1, 2 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తామని, దీనికి సంబంధించి పరీక్ష కేంద్రాలు, పరీక్ష తేదీలను మార్పులు చేసిన హాల్ టిక్కెట్లు అధికారిక వెబ్‌సైట్‌లో ఈనెల 25వ తేదీ నుంచి అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించి తేదీలు మార్పుల చేసిన కొత్త హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోని వాటి ప్రకారం పరీక్షలకు హాజరు కావాలని డీఎస్సీ కన్వీనర్ సూచించారు.

## నీట్ ర్యాంకర్లకు అభినందనలు తెలిపిన నారా లోకేశ్

**నీట్ యూజీ 2025 ఫలితాల్లో సత్తా చాటిన ఏపీ విద్యార్థులు**
**టాప్ 100 ర్యాంకుల్లో రాష్ట్రానికి చెందిన ఆరుగురికి చోటు**
**విద్యార్థులను అభినందిస్తూ మంత్రి నారా లోకేశ్ ట్వీట్**
**19వ ర్యాంకుతో డి.కార్తీక్ రామ్ కిరీటి అగ్రస్థానంలో**
**రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు రాణించడంపై మంత్రి సంతోషం**
**వైద్య వృత్తి ద్వారా ప్రజలకు సేవ చేయాలని విద్యార్థులకు పిలుపు**



**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** నీట్ యూజీ 2025 ఫలితాలు నిన్న విడుదల కాగా, ఏపీకి చెందిన విద్యార్థులు సత్తా చాటడంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందిస్తూ ట్వీట్ చేశారు. "వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ యూజీ పరీక్షా ఫలితాల్లో టాప్-100లో రాష్ట్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు

- తరువాయి 2లో..

## సీఎంతో సినీ ప్రముఖుల సమావేశం వాయిదా !



**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు కలవాల్సిన సమావేశం వాయిదా పడింది. మొదటగా నిర్ణయించిన ప్రకారం ఈ భేటీ రేపు (జూన్ 15వ తేదీ ఆదివారం) సాయంత్రం 4 గంటలకు ఉండవల్లి వద్ద సీఎం నివాసంలో జరగాల్సి ఉంది. అయితే,

- తరువాయి 2లో..



## నెలాఖరులోగా 'స్థానిక' ఎన్నికల షెడ్యూల్ విడుదల

### 'స్థానిక' ఎన్నికలపై పొంగులేటి కీలక ప్రకటన

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ రోజు ఉదయం కీలక ప్రకటన చేశారు. ఈ నెలాఖరులోగా స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని, ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు జరుపుతామని మంత్రి తెలిపారు. ఈ విషయంపై రేపు క్యాబినెట భేటీలో చర్చిస్తామని

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## పేదరికం తగ్గింది అంకెల్లోనే!

ప్రజలకు ఆకలి కోసం అన్నం, కాలక్షేపం కోసం తమాషాలు చూపెట్టండి. వాళ్లు ఎప్పటికీ మీ ప్రజా వ్యతిరేక పాలనను ప్రతిఘటించరు, తిరుగుబాటు చేయరు' అని క్రీస్తుశకం రెండవ శతాబ్దానికి చెందిన డెసిమస్ జునియర్ జువెనెయిల్స్ చేసిన హెచ్చరిక. ఇది తమాషాగానే అనిపించవచ్చు. కానీ ఇది ఈనాటికీ పరిపాలకులు తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు. డెసిమస్ జునియస్ జువెనెయిల్స్ ఆనాటి రోమ్ సామ్రాజ్యంలో ఒక కవి. ఆయన తమాషా కవి. ఆయన రాసిన కవితల పుస్తకం పేరు కూడా 'సెసైర్స్. కొంత మంది కవులు పది కవితలు రాసినా చరిత్రలో నిలిచిపోతారు. చాలా మందికి ఆయన చెప్పిన రెండు చిన్నపదాలు, వాటిని నేను తెలుగు కోసం విస్తరించి రాశాను. అవి "గివ్‌దెమ్ బ్రెడ్ అండ్ సర్కస్, అండ్ దేవిల్ నెవర్ రివోల్ట్" అంటే ఒక రెండు చిన్న వాక్యాలతో కొన్ని వేల పేజీల సారాంశాన్ని ఇమిడ్చాడు. అప్పటి నుంచి చాలా మంది రాజులు, చక్రవర్తులు ఇటువంటి విధానాలనే అవలంబిస్తున్నారు. ప్రజలు కూడా కొన్ని సార్లు ఇటువంటి కుటిల ఆలోచనలకు, విధానాలను లొంగిపోతున్నారు.

దానితో సమాజంలో సంక్షోభం (%జతీఱంఱం ంశీఎఱవ్ఎ%) మరింత పెరిగి తీర్చలేని సమస్యలను సృష్టిస్తోంది. కోట్లాది మంది ప్రజలను ఇంకా ఎన్నో కష్టాల పాలు చేస్తున్నది. ప్రస్తుతం మన దేశంలో అదే జరుగుతున్నది. సమాజం పైకి కనిపించినంత సంతోషంగా, ప్రశాంతంగా లేదు. సముద్రంలో శక్తివంతమైన బడబాగ్ని దాగి ఉన్నట్టే ప్రజల్లో ఎంతో ఆవేదన, ఆవేశం దాగి ఉన్నవి. అయితే అవేవి వాళ్ల ఆలోచనల్లో రాకుండా చేయడానికి అంది వచ్చిన టెక్నాలజీని, రంగు రంగుల మాయా ప్రపంచాన్ని, జీవితాలే ఒక సర్కస్‌గా ఈ సమాజం, పాలకులు తయారు చేస్తున్నారు. ఆ తర్వాత వారేమీ చెప్పినా, ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా, ప్రసారం చేసినా ప్రజల్లో చలనం లేదు. అది ఎంతటి విషాదమైనా క్షణాల్లో మరిచిపోగలిగే అపహాస్యమైన హాస్యాలతో కూడిన వినోదాలను ప్రజలకు వడ్డిస్తున్నారు. నిన్నటి ఘోరమైన విమాన ప్రమాదాన్ని కూడా మనం ఒకటి, రెండు రోజుల్లో మరిచిపోగలం. ఎందుకంటే మన ముందు మాయా ప్రపంచం సృష్టించిన సర్కస్ ఉన్నది.

ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకంటే, ఇటీవల ప్రపంచ బ్యాంకు ఒక నివేదికను తయారు చేసి మన మీద వదిలింది. మన దేశంలో 2011 12 సంవత్సరంలో 27.1 శాతంగా ఉన్న ఘోర కరువు 2022 23 వచ్చే సరికి అది 5.3 శాతానికి తగ్గిపోయింది. ఇది సంతోషకరమైన వార్తే. అయితే ఇది నిజమేనా? మన కళ్ళ ముందున్న పరిస్థితులు దానికి సాక్షంగా ఉన్నాయా? అనేది మనం పరిశీలించాలి. చాలామంది దాని నిజానిజాలు తేల్చడానికి ఉత్సాహం చూపడం లేదు. చాలా మంది మేధావులు మౌనంగా ఉన్నారు. ప్రజల విషయానికొస్తే, అది వాళ్ల దృష్టిలో కూడా లేదు. కొద్ది మంది, కొన్ని మీడియా సంస్థలు ఈ విషయాన్ని కొంత చర్చచేసే ప్రయత్నం చేశాయి, చేస్తున్నాయి. అందరికి అందరూ సర్కస్‌లో లేరు, మాయా తెరలు కప్పుకొని జీవించడం లేదు. వాస్తవ లోకంలో సత్యాన్వేషణలో ఉన్నారు.

అది సంతోషం. ప్రపంచ బ్యాంకు పేదరికానికి ఒక రేఖ గీసింది. గతంలో ఒక వ్యక్తి పేదరికం నుంచి బయట పడాడని నిర్ధారించడానికి ఒక కనిష్ట వినియోగ వ్యయాన్ని నిర్ణయించింది. 2.15 డాలర్లు. అయితే దానిని ఇప్పుడు మూడు డాలర్లుగా పెంచింది. అట్లా పెంచినా కూడా పేదరికం రేటు కూడా బాగా తగ్గింది. 2011 12 లో 16.2 ఉంటే, 202223 నుండి 2.3 శాతానికి తగ్గింది. జనాభాలో తగ్గింది, రేటులో కూడా తగ్గింది. దీనిని కళ్లు, చెవులున్న ఎవరైనా నమ్మే స్థితిలో ఉండకూడదు. అయితే దీని నిజానిజాలు చూద్దాం. ప్రపంచ బ్యాంకు ప్రకారం ఒక మనిషి మూడు డాలర్లు రోజుకు వినియోగం చేయాలి. అంటే ఒక కుటుంబంలో కనీసం నలుగురు ఉంటే ఆ కుటుంబ వ్యయం రోజుకు పన్నెండు డాలర్లు ఉండాలి. అంటే మన దేశ కరెన్సీలో ఈ రోజు లెక్కల ప్రకారం డాలరుకు 86.06 రూపాయలు. నలుగురికి కలిపి 344.24 అంటే 344 రూపాయలు ఒక కుటుంబానికి ఆదాయం ఉండాలి. ఖర్చు చేయాలి. నెలకు 10,327 రూపాయలు.

సంవత్సరానికి 1,23,924 రూపాయలు ఆదాయం, ఖర్చుగాని ఉండాలి. ఇక్కడ రెండు విషయాలు, ఒక కుటుంబం పది వేల రూపాయలతో ఒక నెల జీవితాన్ని కొనసాగించగలదు. ప్రపంచ బ్యాంకు స్వయంగా ఇంతలో దుస్తులు, తిండి, ఇల్లు, వైద్యం, విద్య, ప్రయాణాలు, యాత్రలు అన్ని కలిసి ఉంటాయని ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న ధరలతో ఒక కుటుంబం అంటే నలుగురు సభ్యులు ప్రతి నెలా పది వేల రూపాయలతో ప్రపంచ బ్యాంకు పేర్కొన్న అన్ని వసతులను పొందగలుగుతారా? కనీసం జ్ఞానమున్న ఎవరైనా దీనిని నమ్మే స్థితిలో లేరు. అంటే ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం పదిహేడు కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. మన కళ్ల ముందు మన వాడలో, మన ఊళ్లో ముఖ్యంగా పేదల వాడల్లో ఎంత మంది ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం మంచి జీవితంలోకి వచ్చారు? పేదరికం నుంచి పేదలు బయటపడకపోగా మరింత మంది మధ్య తరగతి వర్గాలు పేదరికం అంచుల్లోకి వెళ్లాయి, వెళుతున్నాయి.

ప్రపంచ బ్యాంకు నిర్ధారించిన కనీస ఆదాయం, ఖర్చు ఈ రోజు చాలా మందికి లేదు. "2022 వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ రిపోర్టు" ప్రకారం ఒక శాతం జనాభా కలిగిన అపర కోటీశ్వరులు 22 శాతం జాతీయ ఆదాయాన్ని కలిగి ఉన్నారు. వీళ్లతో కలిపి 10 శాతం మంది సంపన్నులు 57 శాతం జాతీయ ఆదాయాన్ని సొంతం చేసుకున్నారు. మిగతా తొంబయి శాతం మందిలో 40 శాతం మంది ప్రతి సంవత్సరం 1.65 లక్షల ఆదాయం కలిగి ఉన్నారు. మిగిలిన 50 శాతం మంది కేవలం 71,163 రూపాయలు ఆదాయం కలిగి ఉన్నారు. ఈ లెక్క ప్రకారం చూసినా మన దేశంలో యాభై శాతం మంది పేదరికంలో ఉన్నట్లు గుర్తించాలి. దీనికి ఎవ్వరు సమాధానం చెప్పాలి. అదే సమయంలో ప్రపంచంలోని చాలా ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు ఎన్నో మానవాభివృద్ధి విషయాల మీద అధ్యయనాలు, సర్వేలు చేస్తున్నాయి. అందులో కొన్నింటిని నేను ఇక్కడ ప్రస్తావిస్తాను. పేదరికానికి నేరుగా సరిపోయే సర్వే గ్లోబల్ హంగర్ ఇండెక్స్. ఆకలి సూచిక నివేదికలో భారతదేశం స్థానం 2024 సంవత్సరం ప్రకారం 105వ స్థానం. సర్వే చేసిన మొత్తం దేశాల సంఖ్య 127 మాత్రమే.

127 దేశాల్లో భారత దేశం చివరినుంచి దగ్గరలో ఉంది. ఒకవేళ గత పదిహేను సంవత్సరాల్లో పేదరికం తగ్గిపోయి ఉంటే ఆకలి సూచిక కూడా తగ్గాలి. కానీ అది తగ్గలేదు. దీనిని 'కన్‌పర్న్ వరల్డ్ వైడ్" అనే సంస్థ ప్రతి సంవత్సరం తన నివేదికలను విడుదల చేస్తున్నది. మరో నివేదిక "మానవాభివృద్ధి సూచిక". ప్రపంచ మానవాభివృద్ధి నివేదికను యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (యుఎన్ఒ) విభాగమైన 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యున్‌డిపి) నిర్వహిస్తున్నది. ఇందులో 2025 నివేదిక ప్రకారం భారతదేశ స్థానం 130. సర్వే చేసిన దేశాలు 193. అంటే ఇందులో కూడా మన ప్రగతి ఎక్కడ ఉందో మనం చూశాం. దీని ప్రకారం చూసినా మనం మానవాభివృద్ధిలో అట్టడుగున ఉన్నాం. అత్యంత ముఖ్యమైన మరో నివేదిక వరల్డ్ హ్యాపినెస్ ఇండెక్స్. ఇందులో 147 దేశాలలో అధ్యయనం జరగగా, మన స్థానం 118 మాత్రమే. ఇందులో మానవాభివృద్ధితోపాటు ఇంకా మానసిక, ప్రకృతిపరమైన రక్షణ అంశాలు కూడా ఉంటాయి. ఇందులో మనం వందకు పైగా స్థానంలోనే ఉన్నాం. ఇందులో కుటుంబ తలసరి ఆదాయం, జీవనంలో మెరుగుదల, ఆరోగ్యకరమైన జీవితం, తనకు నచ్చిన విషయాలను ఎన్నుకొని ఆచరించే స్వేచ్ఛ, నిజాయితీ కలిగిన జీవనం, అవినీతి నుంచి విముక్తి లాంటి అంశాలు ఎన్నో ఉన్నాయి. ఇది ఈ రోజు మానవాభివృద్ధికి ఒక ప్రామాణికంగా నిలుస్తున్నది. ఇవి ప్రపంచ గమనాన్ని సూచిస్తున్న కొన్ని నివేదికలు మాత్రమే. అయితే భారతదేశంలోని ప్రజలకు సంబంధించిన కొన్ని లెక్కలు మన ప్రభుత్వమే సేకరించి ప్రకటించింది. అందులో పేదరికంతో ముడిపడి ఉన్న కొన్ని నివేదికలు చూద్దాం. అందులో పౌష్టికాహారం, రక్తహీనత, శిశు, మాతా మరణాలకు సంబంధించినవి. ఇందులో ముఖ్యంగా పౌష్టికాహారానికి సంబంధించి చూస్తే ముందుగా దాని ఫలితం మనిషి రక్తంలో కనిపిస్తున్నది. కనీస మంచి ఆహారం తీసుకున్న వ్యక్తుల్లో రక్తహీనత ఉండదు. కానీ మన దేశంలో మహిళల్లో 57 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. పిల్లలతో కలిపి ఇది 67 శాతానికి పెరుగుతున్నది.దీనికి మరొక విషయాన్ని జోడిస్తే మనకు విషయం అర్థం కాగలదు. ఎనీమియాఅంటే రక్తహీనత ఈ స్థాయిలో ఉంది కాబట్టే, కేంద్ర ప్రభుత్వం 'ఎనీమియా ముక్తి భారత్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. చివరగా ఒక విషయం చెప్పి ముగిస్తాను. మన దేశంలో చాలా కాలంగా పేదలకు సబ్సిడీ కింద ఆహార ధాన్యాలు ప్రత్యేకించి బియ్యం, గోధుమలు ఇస్తున్నారు. దీనికి పేదరికం ప్రామాణికం. దీని ప్రకారం 80 కోట్ల మంది ప్రజలు ఉచిత రేషన్ పొందుతున్నారు. దేశ జనాభా 140 కోట్లు అనుకుంటే, దానిలో 80 కోట్ల మంది ప్రజలు పేదరికంలో ఉన్నందున ఉచిత రేషన్ పొందుతున్నారు. దాదాపు 75 శాతం మంది ఉచిత రేషన్ పొందుతున్నారు. అంటే వీళ్లందరూ పేదలనే కదా మనం ఉచిత రేషన్ ఇస్తున్నారు. ఒక వైపు 75 శాతం జనాభా పేదరికంలో ఉన్నారని ఉచిత ఆహార ధాన్యాలు ఇస్తూనే, రెండో వైపు 5 శాతం మాత్రమే పేదలు ఉన్నారని ప్రపంచ బ్యాంకు ప్రకటించగానే దానిని తమ విజయంగా ప్రకటించి హర్షించడం ఎంత వరకు సబబు.

దీనినే మనం మాయా ప్రపంచం అనక తప్పదు. ఇప్పుడు ప్రపంచ బ్యాంకు, ప్రభుత్వం వేరు వేరుగా ఈ లెక్కలు చేయలేదని మనం గమనించాలి. పేదరికం, నిరుద్యోగం, ఆకలి, అవమానం, అణచివేత, వివక్ష ఇంకా ఈ దేశాన్ని వదలి వెళ్లలేదు. ఇంకా రోజురోజుకూ వాటి తీవ్రత పెరుగుతున్నది. అయితే అవి కనిపించకుండా, వినిపించకుండా ఉండడానికి ఆకలిని తగ్గించడానికి అరకొర ధాన్యం సహాయాలు అందిస్తూ ఎటువంటి ఆలోచనలు రాకుండా మతం, కులం చర్చలు చేస్తూ సమయాన్ని వెళ్లదీస్తున్నారు. మనిషి తాను ఎవరో, తాను ఏమిటో, తన స్థానమెక్కడో తెలుసుకొనే వరకే ఈ రంగులు నిలబడతాయి. ఆ తర్వాత అవే వాటంతట అవే తొలగిపోతాయి. మనిషి ఏనాటికైనా సత్యాన్ని తెలుసుకోవాలి. అంతవరకు వేచి ఉండాలి.

## రైతుల ముసుగులో వైసిపి రాళ్లదాడి : పార్థసారథి



**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎవరైనా రాని తొక్కి పడేస్తాం అంటూ ప్లకార్డులు ప్రదర్శించారని మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. పొదిలిలో వైసిపి నేతలు చేసిన ర్యాలీకి, వారి ప్రవర్తనకు ఏం సంబంధం లేదని అన్నారు. పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. రైతుల ముసుగులో మహిళలు, పోలీసులపై రాళ్లు విసిరారని మండిపడ్డారు. వైసిపి కార్యకర్తలు ప్రవర్తిస్తున్న తీరును రైతులు గుర్తించాలని సూచించారు. నిజంగా రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో ప్రస్తావించాలని, వైసిపి ఎమ్మెల్యేలు పదవీకాంక్షతో అసెంబ్లీకి (%గాంంవఎశ్రీవ్ వఅబతీవ%) ఎగ్గొట్టారని విమర్శించారు. వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి ఒకసారి అసెంబ్లీకి వస్తే.. అప్పుడు కూడా ప్రతిపక్షనేత హెూదా ఇవ్వాలని పార్థసారథి కోరారు.

## పాడేరులో కలుషిత ఆహారం తిని 14 మందికి అస్వస్థత

**పాడేరు జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అల్లూరి జిల్లా పాడేరులో కలుషిత ఆహారం తిని 14 మంది అస్వస్థత గురయ్యారు. బాధితులు పాడేరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అనకాపల్లి జిల్లా నాతవరం నుంచి 20 మంది భక్తులు పాడేరు మొదకొండమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చారు. వారి ఇళ్ళనుంచి తెచ్చుకున్న పులిహోర తిని 14 మంది అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వీరిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.



## 20న ఏపీ తెలంగాణ బంద్

### పిలుపు ఇచ్చిన మావోయిస్ట్‌లు

విజయవంతం చేయాలని కోరుతూ.. మావోయిస్టు నేత జగన్ పేరుతో ఓ లేఖను విడుదల చేశారు. కాగా మావోయిస్టు నేతలు బంద్‌కు పిలుపునివ్వడంతో అప్రమత్తమైన బలగాలు.. ఏఓబీ, తెలంగాణ–ఛత్తీస్గఢ్ సరిహద్దులతో పాటు అటవీ, ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతను ముమ్మరం చేశారు. ఇరువైపుల వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు

## మరో ఘోర ప్రమాదం.. హెలికాప్టర్ కుప్పకూలి ఏడుగురు మృతి

సమయంలో విమానంలో ఏడుగురు ఉన్నారు. ఉత్తరాఖండ్‌లో ఈ ఉదయం హెలికాప్టర్ కూలిన ఘటనలో అందులో ఉన్న ఏడుగురూ మృతి చెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. కేదార్‌నాథ్ ధామ్ నుంచి గుప్తకాశీకి బయలుదేరిన హెలికాప్టర్ రుద్రప్రయాగ్ జిల్లాలోని గౌరీకుండ్ ప్రాంతంలో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న పైలట్‌తో సహా ఆరుగురు యాత్రికులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులలో 23 నెలల చిన్నారి కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఉదయం సుమారు 5:20 గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. కేవలం 10 నిమిషాల ప్రయాణ దూరంలో ఉండగా గౌరీకుండ్, సోన్‌ప్రయాగ్ మధ్య గౌరీమాయ్ ఖార్క్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ కుప్పకూలింది. ప్రతికూల వాతావరణం, సరిగా దారి కనపడకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణాలని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఉత్తరాఖండ్ పౌర విమానయాన అభివృద్ధి సంస్థ (యుకాడా) విడుదల చేసిన ప్రకటన ప్రకారం మరణించిన యాత్రికులలో ఐదుగురు పెద్దలు, ఒక చిన్నారి ఉన్నారు. వీరు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందినవారని తెలిసింది. పైలట్ కూడా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) బృందాలు సహాయక చర్యల కోసం ఘటనా స్థలానికి బయలుదేరాయి. ప్రమాదం జరిగిన గౌరీ మాయ్ ఖార్క్ ఎగువన ఉన్న అటవీ ప్రాంతం చాలా దట్టంగా ఉండటం, అక్కడికి చేరుకోవడానికి సరైన మార్గం లేకపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కష్టతరమైన భూభాగంలో ప్రయాణిస్తూ ప్రమాద స్థలానికి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ దుర్ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "రుద్రప్రయాగ్ జిల్లాలో హెలికాప్టర్ కూలిన వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఎస్డీఆర్ఎఫ్, స్థానిక యంత్రాంగం, ఇతర సహాయక బృందాలు సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నాయి" అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. మే 2న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరిచినప్పటి నుండి ఇది ఐదో విమానయాన సంబంధిత సంఘటన కావడం గమనార్హం. జూన్ 7న కూడా ఒక హెలికాప్టర్ టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపంతో రుద్రప్రయాగ్–గౌరీకుండ్ రహదారిపై అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో హెలికాప్టర్ తోక భాగం పార్క్ చేసి ఉన్న కారును ఢీకొనగా, సమీపంలోని భవనాలకు అత్యంత దగ్గరగా వచ్చింది. అదృష్టవశాత్తూ ఆ ఘటనలో ఐదుగురు యాత్రికులు సురక్షితంగా బయటపడగా, పైలట్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 32 మంది మృతదేహాల గుర్తింపు పూర్తి..

### 13 కుటుంబాలకు అప్పగింత

వెల్లడించారు. వీరిలో 13 మంది మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తెలిపారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, అధికారులు పేర్కొన్నారు. సివిల్ ఆసుపత్రి ఏడీఎంఎస్ డాక్టర్ రజనీష్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ "ఇప్పటివరకు 31 మంది వ్యక్తుల డీఎన్ఏ సరిపోలింది, వారిని గుర్తించాం. వీరిలో 12 మృతదేహాలను ఉదయ్‌పూర్, వడోదర, ఖేడా, కుషీనగర్, అహ్మదాబాద్‌లోని వారి స్వస్థలాలకు పంపించాం" అని తెలిపారు. "మిగిలిన వారి ఆప్తుల మృతదేహాలను తీసుకెళ్లేందుకు మరికొన్ని కుటుంబాలు ముందుకు రావాల్సి ఉంది. ఇతరుల డీఎన్ఏ ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది" అని ఆయన వివరించారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ పరీక్ష ఇంకా కొనసాగుతోందని డాక్టర్ పటేల్ ధ్రువీకరించారు. "ఇప్పటివరకు ఆయన డీఎన్ఏ సరిపోలలేదు. ఫలితం రాగానే సంబంధిత అధికారులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 13 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని కూడా ఆయన వెల్లడించారు. మృతదేహాలు తీవ్రంగా కాలిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో, వాటిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి అయ్యాయి. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) కు చెందిన ఫోరెన్సిక్ బృందాలు ఈ బృహత్తర గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. బాధిత కుటుంబాలకు త్వరితగతిన ఊరట కలిగించేందుకు ఈ బృందాలు అహెూరాత్రులు శ్రమిస్తున్నాయి. ఈ నెల 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787–8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అదుపుతప్పి సివిల్ ఆసుపత్రి బి.జె. మెడికల్ కళాశాల సమీపంలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమాన ప్రయాణికులు, నేలపై ఉన్న నివాసితులు సహా 260 మందికి పైగా మరణించారు. ఒక ప్రయాణికుడు మాత్రం గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం వల్ల సమీప ప్రాంతాల్లో, ముఖ్యంగా అక్కడి వైద్య విద్యార్థుల వసతి గృహాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## మాజీ సీఎం విజయ్ రూపానీ మృతదేహం గుర్తింపు

రోజుల అనంతరం, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ మృతదేహాన్ని గుర్తించినట్లు అధికారులు ధృవీకరించారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా ఆయన భౌతికకాయాన్ని నిర్ధారించినట్లు గుజరాత్ హెూంమంత్రి హర్ష్ సంఘ్వీ వెల్లడించారు. విజయ్ రూపానీ కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన నమూనాలతో, ప్రమాద స్థలంలో లభ్యమైన ఓ మృతదేహం డీఎన్ఏ సరిపోలిందని, దీంతో అది రూపానీదేనని నిర్ధారించుకున్నామని సంఘ్వీ తెలిపారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ విమాన ప్రమాదం అత్యంత తీవ్రమైనది కావడంతో అనేక మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. దీంతో మృతుల గుర్తింపు ప్రక్రియ సవాలుగా మారింది. ఇప్పటివరకు మొత్తం 32 మంది మృతుల డీఎన్ఏ నమూనాలు వారి కుటుంబ సభ్యుల జన్యు నమూనాలతో సరిపోలినట్లు అధికారులు తెలిపారు. గుర్తింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగిస్తున్నారు. డీఎన్ఏ పరీక్షలకు సమయం పడుతుండటంతో మృతదేహాల గుర్తింపులో కొంత జాప్యం జరుగుతోందని వైద్యులు వివరించారు. ఈ నెల 12న అహ్మదాబాద్ నుంచి లండన్ వెళుతున్న ఎయిరిండియా విమానం టేకాఫ్ తీసుకున్న నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 274 మంది వరకు మరణించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో 'యోగా'డే

అందుబాటులో ఉంచేలా ప్రణాళిక వేశారు. ఇందుకోసం ఆంధ్రా వర్సిటీ, కేంద్ర ఆయుష్ విభాగాలతోపాటు రాష్ట్ర క్రీడా సంస్థ నిపుణులు విశాఖలో శిక్షణ ఇస్తున్నారు. మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది యోగాలో పాల్గొనేలా ప్రభుత్వం శిక్షణా శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21 తెల్లవారుజామున ప్రధాని మోదీ ఆర్‌కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద యోగా చేయనున్నారు. మోదీతోపాటు కాళీమాత ఆలయం నుంచి భీమిలి వరకూ 22 కిలోమీటర్లు మేర దాదాపు 5 లక్షల మంది ఆసనాలు వేస్తారు. ఇందుకోసం యోగా శిక్షకులనూ ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్నారు. వారికి ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో శిక్షణ ఇస్తున్నారు.

## రండి... మీరూ పాల్గొనండి

అందిస్తున్న గొప్ప వరం యోగా. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతగానో తోడ్పడుతుంది. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో మన భారత ప్రధాని నరేంద్ర మోదీ గారు పాల్గొంటున్నారు. రికార్డు స్థాయిలో నిర్వహించే ఈ వేడుకను విజయవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతున్నాను. యోగా వ్యాయామం మాత్రమే కాదు మన జీవన విధానం అని చాటిచెప్పండి" అని నారా లోకేశ్ వివరించారు.

## నీట్ ర్యాంకర్లకు అభినందనలు తెలిపిన నారా లోకేశ్

సాధించడం పట్ల వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. 19వ ర్యాంకు సాధించిన డి.కార్తీక్ రామ్ కిరీటి, 56వ ర్యాంకు సాధించిన కె.మోహిత శ్రీరామ్, 59వ ర్యాంకు సాధించిన డి.సూర్యచరణ్, 64వ ర్యాంకు సాధించిన పి.అవినాశ్, 70వ ర్యాంకు సాధించిన వై.సమీర్ కుమార్, 92వ ర్యాంకు సాధించిన టి.శివమణిదీప్ లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీపరీక్షలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉంది. విద్యార్థులు తమ ప్రతిభతో జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి గర్వకారణంగా నిలిచారు. వైద్య వృత్తి ద్వారా భవిష్యత్ లో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని వివరించారు.

## సీఎంతో సినీ ప్రముఖుల సమావేశం వాయిదా !

ఈ సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. పలువురు సినీ ప్రముఖులు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో చిత్రీకరణలతో బిజీగా ఉండటం, అలాగే మరికొందరు ముఖ్యమైన అతిథులు అందుబాటులో లేకపోవడం వలన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తదుపరి సమావేశ తేదీని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## నెలాఖరులోగా 'స్థానిక' ఎన్నికల షెడ్యూల్ విడుదల

వివరించారు. క్యాబినెట్ సమావేశం ముగిశాక ఎన్నికల తేదీలకు సంబంధించి వివరాలు వెల్లడిస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కేవలం 15 రోజులు మాత్రమే గడువు ఉందని, పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు.

# ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య భీకర దాడులు.. 60 మంది మృతి

ఇజ్రాయెల్-ఇరాన్ పరస్పరం భీకర దాడులకు దిగాయి. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయిల్ క్షిపణి దాడుల్లో ఇప్పటివరకు ఇరాన్ లో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఇరాన్ పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడులకు ప్రతీకారంగా శనివారం దాదాపు 200కు పైగా బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌లతో ఇరాన్.. ఇజ్రాయిల్ పై ఎటాక్ చేసింది. ఈ దాడులకు అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన ఇజ్రాయిల్ సైన్యం.. 150కి పైగా ఇరాన్ క్షిపణులను ధ్వంసం చేశాయి. ఇరాన్ దాడుల్లో ముగ్గురు ఇజ్రాయిల్ పౌరులు మృతి చెందగా.. డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో తీవ్రంగా స్పందించిన ఇజ్రాయిల్.. నివాస ప్రాంతాలపై దాడులు ఆపకపోతే టెహ్రాన్ మండిపోతుందంటూ హెచ్చరించింది. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు.. ఇరాన్‌పై దాడులను తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. అయినా ఇరాన్ దాడులు ఆపకపోవడంతో.. ఇజ్రాయిల్ సైన్యం టెహ్రాన్ పై విరుచుకుపడింది. ఈ క్రమంలో శనివారం రాత్రి రెండు దేశాలు పరస్పరం క్షిపణులతో భీకర దాడులకు దిగాయి.

ఇరాన్‌కు ప్రధాన ఆర్థిక జీవనాధారమైన ప్రపంచంలోని అతిపెద్ద గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయిల్ వైమానిక దాడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇరాన్ కు ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగింది. టెహ్రాన్‌లోని ఓ నివాస భవనంపై ఇజ్రాయెల్ క్షిపణి పడటంతో 29 మంది పిల్లలతో సహా దాదాపు 60 మంది మరణించారని ఇరాన్ అధికారులు తెలిపారు. అంతేకాదు, మరో ఇద్దరు ఇరానీ కమాండర్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.



## మెట్ల దారిలో గుండె పోటుతో యువకుడి మృతి



**తిరుమల జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుమలకు వెళ్లిన ఓ యువకుడు గుండెపోటుతో కుప్పకూలాడు. వైద్య సాయం అందేలోపే కన్ను మూశాడు. శనివారం తిరుమల మెట్ల దారిలో చోటుచేసుకుందీ విషాదం. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన జాఫర్ (25) తన బంధువులతో కలిసి తిరుమలకు వెళ్లాడు. ఈ క్రమంలో కొండపైకి మెట్లు ఎక్కుతుండగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. వెంటనే స్పందించిన బంధువులు అతడిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే, మార్గమధ్యలో నే జాఫర్ తుదిశ్వాస విడిచాడని బంధువులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి గోయల్ భేటీ

## కీలక అంశాలపై చర్చ

**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భేటీ అయ్యారు. రాష్ట్రం లో వివిధ అంశాలపై ముఖ్యమంత్రి-కేంద్ర మంత్రి చర్చించారు. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీ తగ్గింపుపై అంశాలపై సీఎం కేంద్ర మంత్రి కివినతి పత్రం అందించారు. తాజా రాజకీయ పరిణామాలు.. ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర సహాయం అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. సీఎం చంద్రబాబుతో సమావేశం తర్వాత గుంటూరు టొబాకో బోర్డ్ కు బయలుదేరారు పీయూష్ గోయల్.. రేపు తిరుమలకు వెళ్లనున్నారు.



## తిరుమలలో సత్ఫలితాలనిస్తున్న క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానం

**తిరుమల జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**తిరుమల** తిరుపతి దేవస్థానం(తితిదే) నూతనంగా ప్రవేశపెట్టిన క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానం సత్ఫలితాలనిస్తోంది. ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి చొరవతో మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని భక్తులు చెబుతున్నారు. ప్రత్యేక దర్శనాల భక్తులతో పాటు సర్వదర్శన టోకెన్లు లేని వారికీ తితిదే పెద్దపీట వేస్తోంది. ఎన్నడూ లేని విధంగా స్వామివారిని దర్శించుకొనే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి.





# అమెరికాలో కాల్పులు..

## ఇద్దరు ప్రజాప్రతినిధుల దారుణ హత్య



అమెరికాలో ఇద్దరు ప్రజాప్రతినిధులు దారుణ హత్యకు గురయ్యారు. శనివారం జరిగిన రాజకీయ ప్రేరేపిత కాల్పుల్లో మిన్నెసోటా హౌస్ మాజీ స్పీకర్ మెలిస్సా హెూర్ట్‌మన్, ఆమె భర్త మరణించగా, రాష్ట్ర సెనేటర్ జాన్ హాఫ్‌మన్, అతని భార్య తీవ్రంగా గాయపడ్డారు. రెండు దాడులు శాసనసభ్యుల నివాసాలపై జరిగాయని అధికారులు నిర్ధారించారు. దీనిని ప్రజాప్రతినిదులను లక్ష్యంగా చేసుకున్న దాడిగా అభివర్ణిస్తున్నారు. ఈ దాడులను ధృవీకరించిన గవర్నర్ టిమ్ వాల్జ్.. హింసను ఖండించారు. ఇది "ప్రజాస్వామ్య ప్రతినిధులపై ఉద్దేశపూర్వకంగా జరిగిన దాడి" అని పేర్కొన్నారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి శాసనసభ్యుల ఇళ్లలోకి ప్రవేశించడానికి చట్ట అమలు అధికారిగా నటించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దర్యాప్తు ప్రారంభ దశలో ఉందని.. దాడుల వెనుక ఉన్నవారిని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

## కేరళలో ఎఫ్-35 ఫైటర్ జెట్ అత్యవసర ల్యాండింగ్..

**న్యూఢిల్లీ జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంధనం తక్కువగా ఉండటంతో శనివారం రాత్రి బ్రిటిష్ ఎఫ్-35 యుద్ధ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. యుద్ధ విమానం విమాన వాహక నౌక నుండి బయలుదేరి రాత్రి 9.30 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అయింది. విమానాశ్రయ అధికారులు సజావుగా, సురక్షితంగా ల్యాండింగ్ అయ్యేలా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. తక్కువ ఇంధనం ఉందని.. ల్యాండ్ చేయడానికి అనుమతి ఇవ్వాలని పైలట్ కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.ప్రస్తుతం విమానం విమానాశ్రయంలోనే నిలిపి ఉంచామని.. సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు అవసరమైన అనుమతి మంజూరు చేసిన తర్వాత ఇంధనం నింపడం జరుగుతుందని వర్గాలు తెలిపాయి.

## బాసరలో విషాదం..

### ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

**బాసర జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



గోదావరిలో స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటన నిర్మల్ జిల్లా బాసరలో చోటుచేసుకుంది. హైదరాబాద్ కు చెందిన ఓ కుటుంబం గోదావరిలో పుణ్యస్నానాల కోసం బాసరకు వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం 18 మంది కుటుంబ సభ్యులు.. పుణ్యస్నానాలకు రాగా, వారిలో ఐదుగురు నీటిలో మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్ట్ మార్టం కోసం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులను హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వరుస ప్రమాదాలు..

### హెలికాప్టర్ సేవలపై నిషేధం



డెహ్రాడూన్: చార్ ధామ్ యాత్ర మార్గంలో వరుస హెలికాప్టర్ల ప్రమాదాలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. ఈ యాత్ర సందర్భంగా ఇటీవల కాలంలో హెలికాప్టర్ల ప్రమాదాలు, అత్యవసర ల్యాండింగ్ ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం తెల్లవారుజామున కేదార్‌నాథ్ సమీపంలో ఓ హెలికాప్టర్ కుప్పకూలి ఏడుగురు మరణించారు. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి హెలికాప్టర్ సేవలను నియంత్రించడానికి, సురక్షితంగా నిర్వహించడానికి కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. హెలికాప్టర్ ప్రమాదంపై విచారం వ్యక్తం చేసిన సిఎం.. చార్ ధామ్ ప్రాంతంలో హెలికాప్టర్ కార్యకలాపాలపై అధికారులతో చర్చించారు. ఈ క్రమంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సమన్వయంతో ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ హెలికాప్టర్ సేవలపై తాత్కాలికంగా నిషేధాన్ని విధించింది. భద్రతా ప్రోటోకాల్‌లను క్షుణ్ణంగా సమీక్షించి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

సోమవారం 16 జూన్ 2025

# విద్యార్థుల సౌకర్యాల పైన మీ శ్రద్ధకు సలాం ఎమ్మెల్యే

**కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి విద్యార్థుల కోసం లక్షల విలువ చేసే 500 బెంచీలు తెప్పించిన ఎమ్మెల్యే అమిలినేని**









**కళ్యాణదుర్గం, జూన్ 15 (తెలుగు రాష్ట్రం విలేకరి):** కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు ఎక్కడున్నా ఏం చేస్తున్నా నియోజకవర్గం పైన ఆలోచన అభివృద్ధి పైన ఆకాంక్ష అందులో భాగంగా ఎమ్మెల్యే సురేంద్రబాబుకు ఉన్న పరిచయాలతో కార్పొరేట్ సంస్థ పవర్ మంచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ చైర్మన్ కిషోర్ సిఎస్ఆర్ కింద లక్షల విలువ చేసే బెంచీలు కళ్యాణదుర్గంకు ఇవ్వడం జరిగింది. ఆ బెంచీలు నేడు కళ్యాణదుర్గం ప్రజా వేదిక వద్దకు చేరాయి. గతంలో శాసనసభ్యులు సురేంద్రబాబు నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు కూర్చోవడానికి బెంచీలు కొన్ని తక్కువగా ఉన్నాయని అడ్జస్మెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు అందులో భాగంగా తెప్పించడం గొప్ప విషయం ఈ బెంచీలు సెట్ చేసిన తర్వాత ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆయా పాఠశాలలకు బెంచీలు పంపనున్నారు. ఈ మేరకు ప్రజలు ఆయన సేవలను చదువుపై ఉన్న శ్రద్ధను మెచ్చుకుంటున్నారు.

### ఆదివాసీల గిరిజనుల ఇంటి నిర్మాణానికి

# నివాస సామగ్రి అందజేత

**ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న ఆపద్బాంధవుడు జమాల్ ఖాన్**




**వి ఆర్ పురం, జూన్ 15 (తెలుగు రాష్ట్రం విలేకరి):** పెద్దమట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గుర్రంపేట గ్రామంలో మతిస్థిమితం లేని ఓ ఆదివాసి గిరిజన అభాగ్యురాలి ఇంటి నిర్మాణానికి, రామవరం గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురయిన బాధిత కుటుంబానికి జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ రెండు కుటుంబాల వారికి ఇంటి నిర్మాణ సామాగ్రిని అందజేశారు. గుర్రంపేట గ్రామంలో మతిస్థిమితం లేని మడకం రమణమ్మ అను తల్లి కొడుకులు మతిస్థిమితం లేక నిస్సహాయ స్థితిలో ఉన్నారని గ్రామస్తులు అభ్యర్ధన మేరకు జమాల్ ఖాన్ ఇంటి నిర్మాణానికి కావలసిన సామాగ్రిని అందజేశారు. అదేవిధంగా రామవరం గ్రామానికి చెందిన సోలా నరసింహారావు అనే గిరిజనుడు ఇల్లు అగ్ని ప్రమాదానికి గురి కావడంతో నిలువ నీడ లేకుండా పోయిందని గ్రామస్తులు జమాల్ ఖాన్ ను ఇంటి నిర్మాణ సామాగ్రి అందజేయాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించి స్వయాన తన వాహనంలోనే సిమెంట్ రేకులు ఇనుప పైపులను తెచ్చి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుంజా నాగయ్య, ముత్తయ్య. జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు ఎస్కే షాజహాన్. నాయకులు ఏం డి జహంగీర్. పీ.సాల్మన్ రాజు, నటరాజు, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఈదరపల్లి, నడిపూడి వంతెనల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందరావు







**అమలాపురం, జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఈదరపల్లిచ, నడిపూడి వంతెనల నిర్మాణ పనులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పరిశీలించి వేగవంతంగా వంతెన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అధికారి బాబ్జి, దున్నాల దుర్గా, యువనాయకులు అయితాబత్తుల కరణ్ తదితరులు పాల్గొన్నారు



# పలువురికి ఎమ్మెల్యే అయితాబత్తుల పరామర్శ

**అమలాపురం, జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** అమలాపురం పరిధిలోని పలువురు నాయకులను, సన్నితులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం పరామర్శించారు. చనిపోయిన వారికి నివాళులు అర్పించి వారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.




**గోకరకొండ సూరిబాబుకు ఎమ్మెల్యే అయితాబత్తుల పరామర్శ**

తల్లి మరణంతో బాధపడుతున్న అమలాపురం పట్టణానికి చెందిన గోకరకొండ సూరిబాబుని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ఆయన వెంట ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రెడ్డి సత్య నాగేంద్రమణి, అధికారి బాబ్జి, దున్నాల దుర్గా, యువనాయకులు అయితాబత్తుల కరణ్, బోనం సత్తిబాబు పాల్గొన్నారు.



**జనసేన నాయకులు లింగోలు పండుకు ఎమ్మెల్యే ఆనందరావు పరామర్శ**

జనసేన నాయకులు లింగోలు పండు గారి నానమ్మ గారి మృతికి సంతాపం తెలియజేసి, పండు గారిని పరామర్శించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో లింగోలు నెహ్రూ, లింగోలు పండు, వాకపల్లి శ్రీను మరియు తదితరులు



**వేమవరం గ్రామ కమిటీ అధ్యక్షులు నారాయణను పరామర్శించిన ఎమ్మెల్యే**

ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న వేమవరం గ్రామ కమిటీ అధ్యక్షులు నారాయణను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు.

**తాండవపల్లి నంద్యాల రామారావు కుమారుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం**

తాండవపల్లి నంద్యాల రామారావు కుమారుడి మృతి పట్ల సంతాపం తెలియజేసి, రామారావుని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ mpp బొర్రా ఈశ్వరరావు, బొర్రా వెంకటేశ్వరరావు, నంధ్యాల దొరబాబు, కైరం రాము మరియు తదితరులు పాల్గొన్నారు







# బాధిత కుటుంబాలకు బంధువుగా ఆదుకుంటున్న ఉపాధ్యాయుడు బద్దె నాయక్

**కళ్యాణదుర్గం, జూన్ 15 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** విద్య వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న బలహీన వర్గాలకు చెందిన బాధిత కుటుంబాలకు బంధువుగా మారి సాయం చేస్తున్నారు ఉపాధ్యాయుడు బద్దే నాయక్. ఆపదలో ఆపన్న హస్తం కోసం అడిగిన వెంటనే ఆర్థిక సాయం చేశారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఉపాధ్యాయుడు, బద్దేనాయక్. సెట్టూరు మండలం కైరేవు గ్రామానికి చెందిన హరిజన వన్నూరు స్వామి గొంతు ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్నారు. ఆయనకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ విజయవంతమైనది. వీరికి బయట మందులు తదితర ఖర్చులకు చెల్లి గవ్వ కూడా లేదని వన్నూర స్వామిని ఆదుకోవాలని గ్రామస్తులు బద్దేనాయకుని కోరగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఇదే ఆసుపత్రిలో గ్రామానికి చెందిన ఆర్థిక సాయం అందించారు. అలాగే పాల్లూరు వెంకటం పల్లి గ్రామానికి చెందిన వన్నూరప్పకు ఆపరేషన్ జరిగింది ఆయనను పరామర్శించి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సాయినాథ్, మహలింగ దితరులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మాసోత్సవాలు

## -జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి

**రాజమహేంద్రవరం, జూన్15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** జూన్ 21 వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి పేర్కొన్నారు. స్థానిక డా అల్లూరి రామలింగయ్య ప్రభుత్వ హెూమియో వైద్య కళాశాల లో ఆదివారం యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఆర్వో టి సీతారామ మూర్తి మాట్లాడుతూ , యోగా సాధన కార్యక్రమం కోసం వానపడుతున్న వొచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేశారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మే 21 నుంచి జూన్ 21 వరకు క్యాలెండర్ ప్రకారం యోగా సాధన కార్యక్రమం ఆయుష్, జిలా యాత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరూ మరింత మందికి ప్రేరణ కలిగించాలన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని వివిధ శాఖల, రంగాల వారితో యోగా చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించడం జరిగిందన్నారు. జూన్ 14 వ తేదీన జూన్ 21 న తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రిహార్సల్స్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేలకు పైగా ప్రాంతాల్లో 7,80,000 వేల మందితో యోగా దినోత్సవం లో పాలుపంచుకున్నట్లు తెలిపారు. యోగా సాధన కార్యక్రమం లో రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల 50 లక్షల మందితో , జూన్ 21 న దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విశాఖపట్నం లో ఐదు లక్షల మందితో యోగా చేయాలని సంకల్పించడం జరిగిందన్నారు. రానున్న 6 రోజులు మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని పేర్కొన్నారు.యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా రాజమహేంద్రవరం నగర ప్రజలు అందరూ వేకువ జామునే లేచి యోగ సాధనకు హాజరు కావటం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు అన్నారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన కార్యక్రమం లో ప్రతి శాఖకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది అందరూ విరివిగా పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతానికి దోహదపడటం ఎంతో గర్వంగా ఉందని ఆయన అన్నారు. తెల్లవారుజామున లేచి మళ్ళీ పడుకుంటే అనారోగ్యాలు గురిచేస్తుందని ఇది మంచి ప్రక్రియ కాదని ఆయన తెలియజేశారు. ఉదయం లేచిన తర్వాత యోగ అనేది జీవనశైలిగా మార్చుకొని నిత్య సాధన చేస్తూ ఉంటే పరిపూర్ణ ఆరోగ్యం గా జీవిస్తామని తెలియజేశారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జూన్ 21 యోగా డే ప్రతిపాదన చేసిన విషయం విదితమే, ఉత్తర అర్ధగోళంలో సంవత్సరంలో అతి పొడవైన రోజు మరియు ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ప్రత్యేక ప్రాముఖ్యతను పంచుకుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతమవ్వడం లో విస్తృత ప్రచారం నిర్వహించవలసి ఉందని తెలియజేశారు. ఈ యోగా సాధన కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు , ఆయుష్ వైద్యులు డాక్టర్ కె.సీహెచ్. రమేష్, ఆయుష్ నోడల్ అధికారి పి. కేజియా, వైద్యాధికారులు , బ్రహ్మ కుమారి సిస్టర్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయుష్ , వైద్య ఆరోగ్య, హెూమియో వైద్యులు, విద్యార్థులు, యోగా సాధనకులు తదితరులు పాల్గొన్నారు.





# రౌడీ షీటర్లు, అనుమానితులకు కౌన్సిలింగ్

**జగ్గయ్యపేట, జూన్ 15 (తెలుగురాష్ట్రం విలేకరి):** జగ్గయ్యపేట పట్టణ పోలీస్ స్టేషన్లో ఆదివారం జగ్గయ్యపేట సిఐ పీ. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జగ్గయ్యపేట, చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కు కౌన్సిలింగ్ జరిగినది. సన్మార్గంలో ఉంటూ పోలీసులకు, సమాజానికి సహకరించాలని వారిని సీఐ కోరారు. పద్ధతి మార్చుకోకుండా నేర ప్రవర్తన కొనసాగించే వారిని ఉపేక్షించమని, వారిపై పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేసి కఠిన చర్య తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్ హాజరు కావాలని, రానివారు వారు హేతుబద్ధమైన కారణాలు తెలియ జేయాల్సి ఉంటుందన్నారు. జగ్గయ్యపేట ఎస్ఐ జి. రాజు, చిలకల్లు ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య

**పోలవరం, జూన్ 15 (తెలుగు రాష్ట్రం విలేకరి):** భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన పోలవరంలోని బాపూజీ కాలనీలో చోటుచేసుకుంది. చింతా వీరభద్రరావు(55) భార్య ఆరేళ్ల క్రితం మృతిచెందగా, భరించలేని భర్త ఈనెల 4న చెదల మందును తాగి ఆత్మహత్యకు యత్నించాడు. రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుమారుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై పవన్కుమార్ తెలిపారు.

# అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ పధకాలు

## 15 నుండి 30 వరకు అవగాహనా కార్యక్రమాలు -ఎజిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్




**పాడేరు, జూన్ 15 (తెలుగురాష్ట్రం విలేకరి):** కేంద్ర ప్రభుత్వం గిరిజనులకోసం అనేక పధకాలు ప్రవేశ పెట్టిందని, ముఖ్యంగా దేశంలోనే అత్యధికంగా గిరిజన జనాభా ఉన్న మన జిల్లాకు కేంద్ర ప్రభుత్వ పధకాలు వరం గా భావించాలని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ నే%ళి%పద్యంలో అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ పధకాలు అందిచడమే ధ్యేయంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆదివారం పాడేరు మండలం చింతల వీధి సచివాలయంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి దర్తీ అభా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (పీఎం డిఎజుగా) జనజాతీ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పి ఎం జన్మన్) ఈనెల 15 నుండి 30 వ తేదీ వరకు గిరిజనులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమగ్రమైన గిరిజనాభివృద్ధికి పీఎం డిఎ జుగా దోహద పడుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో అత్యంత వెనుకబడిన గ్రామాలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పి0చి అర్హులైన లబ్దిదారులను గుర్తించి ప్రభత్వ పథకాలను అందిస్తామని స్పష్టం చేసారు. లబ్దిదారులకు ఆధార్ కార్డుల రిజిస్ట్రేషన్లు, పి ఎం జన్ ధన్ బ్యాంకు ఖాతాలు తెరవడం, కొత్త గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు, కిసాన్ కార్డులు, కులధృవీకరణ పత్రాలు, ఉపాధి హామీ జాబ్ కార్డులు, పోషన్ అభియాన్ నమోదు, తదితర సేవలు అందించి గిరిజనులకు లబ్ది చేకూర్చడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పిఎం జన్ మన్ కింద చింతలవీధి పంచాయతీలో 37 మంది లబ్దిదారులకు గృహాలు మంజూరు చేసారు. పాఠశాలలకు దూరంగా ఉన్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య భోజన సదుపాయాలు వసతి సౌకర్యాలు కల్పించడానికి జిల్లాకు 22 హాస్టల్సు మంజూరయ్యాయన్నారు. సర్వ శిక్షా అభియాన్ కింద 11, గిరిజన సంక్షేమ శాఖ నుండి 22 హాస్టల్సు మంజూరయ్యాయని చెప్పారు. వంద మంది జనాభా దాటిన అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి డోలీ మోతలను తగ్గిస్తామన్నారు. అందుకు గాను రూ. 454 కోట్లు మంజూరు జరిగిందన్నారు. పిఎం జన్ మన్ కింద 18,448 మంది ఇళ్ళకు విధ్యత్ కనెక్షన్ అందించడం జరిగిందని, మిగిలిన 490 ఇళ్ళకు కూడా కనెక్షన్లు అందిస్తామన్నారు. రూ. 70 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జ్ ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందన్నారు. జిల్లాలో 1590 సెల్ టవర్లు మంజూరు చేయడం జరిగిందని, అందులో 1208 పూర్తి కాగా మిగిలనవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. పోడు వ్యవసాయం చేస్తున్న అర్హులైన గిరిజనులకు అటవీ భూములను పంపిణీ చేసామన్నారు. ముందుగా సచివాలయం వద్ద మొక్కలు నాటిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన, వైద్య శిభిరం, ఐసిడిఎస్, వెలుగు స్టాళ్లను పరిశీలించారు. అనంతరం రకాల అటవీ ఉత్పత్తులను, చిరు ధాన్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వంతల సీతమ్మ, ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణా రావు, సెంట్రల్ కాఫీ బోర్డ్ డైరెక్టర్ కే. ఉమా మహేశ్వర్ రావు, హౌసింగ్ పిడి వి. బాబు, ఐటిడిఎ ఎపిఓ ఎం. వెంకటేశ్వర రావు, ఎంపిడిఓ తేజ రత్న, పిఎంయు అధికారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామికి ఘన సన్మానం



**రాజమహేంద్రవరం, జూన్ 15(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాష్ట్రంలో టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను, ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి హామీ ఇచ్చారు. ఫెడరేషన్ చైర్మన్ గా నియమితులైన ఆకాశపు స్వామికి ఆదివారం రాజమండ్రిలో తూర్పుగోదావరి జిల్లా టైలర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. అధ్యక్షుడు పి.వెంకటరావు (మణి టైలర్స్), రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాలు (బాలు టైలర్స్) జిల్లా ఫెడరేషన్ సభ్యులు ఈ ఆత్మీయ సత్కార కార్యక్రమానికి సారధ్యం వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి మాట్లాడుతూ టైలర్లు తమ సమస్యలను వాట్సాప్ గ్రూపుల్లో పెట్టకుండా నేరుగా తనకు తెలియచేయాలని కోరారు. వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడం వల్ల అపోహలకు దారి తీస్తుందని ఆయన అన్నారు. టైలర్ల సమస్యల గురించి తనకు పూర్తి అవగాహన ఉందని ఆయన చెప్పారు. ఫెడరేషన్ స్థాయిలో పరిషరించాల్సినవి తమ వంతుగా చేస్తామని, మిగతా సమస్యలను, ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చైర్మన్ ఆకాశపు స్వామి చెప్పారు. తన తండ్రి ఆకాశపు కృష్ణమూర్తి తన జీవితాన్ని టైలర్లకే అంకితం చేశారని, టైలర్లంటే ఆయనకు అంత అభిమానమని ఆకాశపు స్వామి చెప్పారు.ఈనెల 2 వ తేదీన ఫెడరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తాను టైలర్ల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టైడర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పోసి బాబు(తాళ్లపూడి),19 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపు నివారణ దినోత్సవం




**రాజమహేంద్రవరం, జూన్15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఆదివారం స్థానిక ఆర్యపురం ఏబి నాగేశ్వరరావు పార్కు లోని డే కేర్ భవనం లో సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపు నివారణ దినోత్సవ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా, ముఖ్య అతిధి గా విచ్చేసిన జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎన్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ, ఎంతో అనుభవం గల సీనియర్ సిటిజన్స్ ఉన్న, ఈ కార్యక్రమానికి రావడం చాలా సంతోషం గా ఉందన్నారు. వారి అనుభవం నుండి ఎన్నో మంచి విషయాలు నేర్చుకోవాలని అన్నారు. అందరికీ న్యాయం అందించాలనే ధ్యేయంతో, ఏర్పాటు చేయబడిన న్యాయ సేవాధికార సంస్థ, వృద్ధులు, మహిళలు, 18 లోపు పిల్లలు, వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉన్న పేద కుటుంబాలకు ఉచిత న్యాయం అందేలా సహాయ పడుతుందన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో గల తమ డి ఎల్ ఎస్ ఎ ఆఫీస్ లో వచ్చి లేదా టోల్ ఫ్రీ నెం. 15100కు ఫోన్ చేసి న్యాయ సేవలు పొందాలని సూచించారు. అలాగే, అర్హత గలవారికి న్యాయపరంగా వచ్చే పెన్షన్, పట్టాలు అందక పోవడం వంటి సమస్యల పరిష్కారానికి కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఇటీవలి కాలంలో కాలానుగుణంగా, కుటుంబ సంబంధ బాంధవ్యాలలో, వచ్చిన మార్పుల దృష్ట్యా, వృద్ధులు నిరాధారణకు, వేధింపులకు గురవుతున్నారని, ఇది ఎంతో ఆవేదన చెందాల్సిన విషయం అన్నారు. నేటి ఆధునిక పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక పరమైన విషయాలలో, ప్రేమానురాగాల కతీతంగా, తగు జాగ్రత్తలు తీసుకోవడం తప్పని అన్నారు. వీలునామా కూడా, తమ తదనంతరం మాత్రమే, పిల్లలకు చెందేలా వ్రాయాలన్నారు. తల్లిదండ్రులు, పిల్లలకు, మంచి చెడుల గురించి, కుటుంబ సంబంధ బాంధ వ్యాలు, ప్రేమానురాగాల విలువలు, గురించి వంట బట్టేలా నేర్పించాలని శ్రీలక్ష్మి ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రేమ ఒక ప్రవాహంలా, పెద్దల నుండి పిల్లల వైపే ప్రవహిస్తుంది తప్ప.. పిల్లల నుండి పెద్దల వైపుకు ప్రవహించ లేకపోతున్నదని ఆవేదన వ్యక్త పరిచారు. మానవ సంబంధాలు మెరుగు పరచడం ద్వారా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడడం సాధ్యం అవుతుందని వ్యక్తులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ అశోక్ కుమార్ జైన్, కార్యదర్శి లక్ష్మణ రావు, సభ్యులు కెకె సంజీవరావు, కె. శంకర రావు, నరేంద్ర బాబు, సత్యనారాయణ, జి. అప్పారావు, కోర్టు సిబ్బంది మహేష్, ఉదయ్, లీగల్ వాలంటీర్స్ వీరరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 16వ తేదీన యధావిధిగా పిజిఆర్ఎస్

## -జిల్లా కలెక్టర్ ప్రశాంతి

**రాజమహేంద్రవరం, జూన్ 15(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా, డివిజన్ మండల స్థాయి లో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ జూన్ 16 వ తేదీ సోమవారం రోజున యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం “1100 – మీకోసం కాల్ సెంటర్” కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు మరియు నమోదైన మీ అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్సైట్ నందు అర్జీ నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. నేరుగా అర్జీలు ఇవ్వలేని వారు మీ కోసం వెబ్ సైట్ లో ఆన్‌లైన్ ద్వారా మీ ఫిర్యాదు నమోదు చేయవచ్చు అని తెలియ చేశారు.



జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్ , మండల కేంద్రంలో జూన్ 16 ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు , జిల్లా, డివిజన్ మండల, మునిసిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రజలు వ్యయ ప్రయాసలుపడి ప్రభుత్వ కార్యాలయాలకు వొచ్చి ఫిర్యాదు చెయ్యకుండా “1100” టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా తమ సమస్యలను తెలియ చేయడం ద్వారా , గతంలో అందచేసిన అర్జిల స్థాయి కూడా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సత్వర పౌర సేవలను పొందేందుకు, వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా ఈ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకుని రావడం జరిగిందన్నారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# ప్రాణాలు ఎలాగూ మిగల్లేదు.. కనీసం మృతదేహాలైనా ఇవ్వండి!

## విమాన ప్రమాదఘటన బాధితకుటుంబాల ఆవేదన



**న్యూఢిల్లీ జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద ఘటనలో సజీవ దహనమైన వారి మృతదేహాలను గుర్తించడం కష్టతరమవుతోంది. శరీరాలు ఛిద్రమైపోవడంతో అవి ఎవరివో తేల్చడం కత్తిమీద సాములా మారింది. ప్రతి శరీరభాగానికి డీఎన్ఏ టెస్టులు చేయాల్సి రావడంతో ఎక్కువ సమయం తీసుకుంటోంది. మరోవైపు మాంసపు ముద్దలు ఇచ్చి.. 'ఇవి మీ వారివే' అని వైద్యులు చెబుతుంటే.. బంధువులు అంగీకరించలేకపోతున్నారు. ఒకట్రెండు ముక్కలు కాకుండా పూర్తి మృతదేహాలను అప్పగిస్తే అంత్యక్రియలైనా గౌరవంగా నిర్వహించుకుంటామంటూ వారు పడుతున్న ఆవేదన గుండెల్ని మెలిపెడుతోంది.**

డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్న అహ్మదాబాద్‌లోని సివిల్ ఆస్పత్రిలోని శవాగారం వద్ద.. మృతదేహాన్ని తీసుకొచ్చే సంచీలో రెండు తలలు ఉండటం వివాదానికి తావిచ్చింది. అప్రమత్తమైన వైద్యాధికారులు వెంటనే మరోసారి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తన కుటుంబ సభ్యుల అవశేషాలన్నీ అప్పగించమని ఓ వ్యక్తి అధికారులను వేడుకున్నారు. అయితే, అది సాధ్యం కాదని అతి కష్టం మీద ఆయనను అధికారులు ఒప్పించారు. కష్టమని తెలిసినా.. ఆత్మీయులను కోల్పోయిన బాధలో బాధిత కుటుంబీకులు వైద్యులను ప్రాధేయపడుతున్న తీరు కన్నీరు తెప్పిస్తోంది. ఓ వైపు కుటుంబీకులను కోల్పోయామన్న బాధ, మరోవైపు కనీసం వారి మృతదేహాలను కూడా ఇంటికి తీసుకెళ్లలేకపోతున్నామన్న ఆవేదనతో ఆస్పత్రి ఆవరణలో పరిస్థితి హృదయవిదారకంగా మారింది.

విమాన ప్రమాదంలో మృతి చెందినవారి మృతదేహాలను అహ్మదాబాద్‌లోని 1200 పడకల సివిల్ ఆస్పత్రిలో భద్రపరిచారు. రక్తసంబంధీకుల నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించి, మృతదేహాల నమూనాలతో సరిపోల్చి.. బంధువులకు అప్పగిస్తున్నారు. ఇప్పటి వరకు 14 మంది మృతుల డీఎన్ఏను వారి కుటుంబ సభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు అధికారులు వెల్లడించారు. డీఎన్ఏ పరీక్షతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. వీలైనంత వరకు మిగతా మృతుల డీఎన్ఏను గుర్తించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బాధితుల కుటుంబాలతో సమన్వయం చేసుకోవడానికి 230 బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

# శ్రీశ్రీ ఒక తీరని దాహం

**జలజల పారే గంగా గోదావరీ అనే జీవ నదులూ, మబ్బుల్ని తాకే హిమాలయ పర్వత శ్రేణులూ, పున్నమి వెన్నెల్లో తాజ్ మహల్ సౌందర్యమూ, బిస్మిల్లాఖాన్ షెహనాయి రాగాల లాలిత్యమూ... వీటి గురించి మళ్లీ మళ్లీ మాట్లాడుకున్నా బావుంటుంది. కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ యేల ఏడ్చెదో... బాల రసాలసాల నవపల్లవ కోమల కావ్య కన్యకున్... మందార మకరంద మాధుర్యమును గ్రోలు... వంటి తియ్యని తెలుగు కవిత్వాన్నీ, సిరులు మించిన పసిడి బంగారు జిలుగు దుప్పటి జారగా... అంటూ కవ్వించే జనార్దనాష్టకం పద్యాల నడకలోని తూగునీ ఎన్నిసార్లు పాడుకున్నా అదే చెక్కుచెదరని అందం. అంతే తన్మయత్వం!మహాభారతం, 'కన్యాశుల్కం', 'అన్నా కరెనినా', 'ద బ్రదర్స్ కరమజోవ్', 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్', చలం 'ఓ పువ్వు పూసింది'- ఎలాగో 'మహాప్రస్థానమూ' అంతే.**




ఒక సూపర్ క్లాసిక్. మరిచిపోలేని మాస్టర్ పీస్! అది తెలుగు సాహిత్యాన్ని యుద్ధరంగంలోకి నడిపించింది. తెలుగు కవిత్వాన్ని అజేయమైన శక్తిగా నిలిపింది. నీలాకాశంలోకి తెలుగు పతాకాన్ని ఎగరేసింది. విశ్వనాథ సత్యనారాయణ లాంటి పండితుడూ,సంప్రదాయవాదీ విస్తుపోయాడంటే, శ్రీశ్రీ ఎగరేసిన జెండాలా, సంస్కృత సమాసాలకు తల్ల కిందులై కాదు, అందులోని స్వచ్ఛమైన అచ్చమయిన కవిత్వాన్ని చూసి, అలా రాయడం మరొకరి వల్లకాదని తెలిసి! 'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు? ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసిన బోయీ లెవ్వరు?'%-% విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో ఆ నాలుగు లైన్లూ చదివి, దివాకర్ల వెంకటావధాని, రెండు మూడొందల ఏళ్ళ తెలుగు సాహిత్య చరిత్రలో ఇలా అన్నవాడెవడూ లేడని ఒక ఉద్వేగంతో చెప్పారు.

శ్రీశ్రీని పరుసవేది అన్నాడు జ్వాలాముఖి. మోడువారిన చెట్టు చిగురించి మళ్లీ జీవితంలోకి ప్రవేశించడం మనకి నేర్పుతుంది. శ్రీశ్రీ కవిత్వం చదివిన వాళ్ళందరి అనుభవమూ అదే. మనో వాక్కాయకర్మ శుద్ధి పరిపూర్ణంగా గలవాడికి మాత్రమే అలాంటి కవిత్వం సిద్ధిస్తుంది. సరస్వతీదేవి సాక్షాత్కరిస్తుంది.

మహాప్రస్థానానికి 75 ఏళ్లు అంటున్నారు. తొలిసారి 1950లో అచ్చయింది గనక ఇలా అనొచ్చు. హంగ్రీ థర్టీస్‌లోనే 1934-40 మధ్యనే శ్రీశ్రీ ఈ గీతాలు రాశారు. రాసి తొంభై సంవత్సరాలు అయింది. సెలబ్రేట్ చేసుకోడానికి ఒక అకేషన్ అని తప్పితే, జీవ నది లాంటి ఆ కవిత్వం మన సంస్కృతిలో, అనుభూతిలో, మన రక్తంలో ఎప్పటికీ ప్రవహిస్తూనే ఉంటుంది. మహాప్రస్థానంలో మీకు ఏ కవిత ఇష్టం? కొంపెల్ల జనార్ధనరావు కోసమా? ఎచటికి పోతావీ రాత్రి? దారిపక్క చెట్టుకింద కూర్చున్న ముసిల్దా? సంధ్యా సమస్యలా? శైశవ గీతా? గంటలా? కవితా ఓ కవితా? ఇలా మనం ఎన్ని పొయెమ్స్ అయినా చెప్పగలం.

వాటిని అప్పచెప్పగలం కూడా! అయితే, తాను రాసిన వాటిల్లో శ్రీశ్రీకి బాగా నచ్చిన కవిత ఏదో తెలుసా? అది మహాప్రస్థానంలో లేదని కూడా తెలుసా? 'శరశ్చంద్రిక' నాకు యిష్టం అని ఒక సందర్భంలో చెప్పారు శ్రీశ్రీ. ఆ దీర్ఘ కవిత 'ఖడ్గసృష్టి'లో మొట్టమొదటిది! నవీన విశ్వవిద్యా లయాల్లో పురాణ కవిత్వంలాగా శ్రవణ యంత్రశాలల్లో శాస్త్రీయ సంగీతం లాగా ఇలా వచ్చావేం వెన్నెలా? అంటూ వెన్నెలలో మహాకవి సంభాషణ మొదలవుతుంది. సాదాసీదాగా, నిరలంకారంగా, ఊర్నే నువ్వూ నేనూ మాట్లాడుకున్నట్టే ఉంటుంది. శరశ్చంద్రిక చదవడం పూర్తి అయ్యేసరికి మనం ఒక వెన్నెల తుఫాన్‌లో చిక్కుకుపోతాం. సాక్షాత్తూ వెన్నెల సముద్రం మీద సంతకం చేస్తున్న దృశ్యం ఒక మహత్తరమైన పెయింటింగ్‌లా మనోఫలకం మీద నిలిచిపోతుంది.

ప్రలోభాలకూ, పద్మశ్రీలకూ తలవంచని తీరానికి చెందిన వాడు. పురిపండా అప్పలస్వామి ఒరియా సాహిత్య చరిత్ర రాసిన తెలుగువాడు. చేతిరాతతో లండన్ మహాప్రస్థానం ఎందుకూ? అని శ్రీశ్రీ సందేహిస్తున్నపుడు, పురిపండా ఇలా అన్నారు: 'మహాప్రస్థానం ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన ఏకైక మహాకావ్యం. నాకు తెలిసినంత మట్టుకు మరే భారతీయ భాషలోనూ 'కవితా ఓ కవితా' అంత గొప్పగీతం రాలేదు'. ఈ మాట ఒక జ్ఞానపీఠ్ అవార్డు కన్నా తక్కువదేమీ కాదు. మార్క్సిస్ట్ ఈస్థటిక్స్‌కి మహా ప్రస్థానమే ఒక సజీవ ఉదాహరణ.

గదిలో ఎవరూ లేరు, గదినిండా నిశ్శబ్దం, సాయంత్రం ఆరున్నర, గదిలోపల చినుకుల వలె చీకట్లు... అని మొదలవుతుంది 'ఆకాశ దీపం', వట్టి వచనం. తొంభై సంవత్సరాల క్రితం ఇలా రాయడానికి ఎంత ధైర్యం శ్రీశ్రీకి? 'దీపం ఆరిపోయింది %-% తారగా మారిపోయింది' అని కవిత ముగిసేసరికి గుండె పేలి పోతుంది. అందుకే చలం 'బుద్ధున్నవాడెవడూ దీన్ని కవిత్వం అనడు' అన్నారు. ఈ కవి అప్పీల్ బుద్ధినీ, వివేకాన్నీ, కళానిబంధ నల్నీ మించిన ఏ అంతరాళానికో తగుల్తుంది. ఆ అంతరాళం అనేది ఉన్నవాళ్ళకి అని చెప్పారు.

నిప్పులు చిమ్ముకుంటూ... అంటూ ఆరు లైన్ల పొట్టి కవిత రాసినా, కవితా ఓ కవితా అని ఆరేడు పేజీల దీర్ఘకవిత్వం రాసినా శ్రీశ్రీలో ఆవేశం, సముద్ర కెరటమై ఎగిసిపడుతుంది. లెనిన్, స్విన్ బర్న్, సాల్వడార్ డాలీ, కొంపెల్ల జనార్ధనరావు... ఇలా ఎవరి గురించి రాసినా పాఠకుణ్ణి నిద్రపోనివ్వని శ్రీశ్రీ ముద్ర మనందరి కలెక్టివ్ ఎక్స్‌పీరియర్స్! కనకదుర్గా చండ సింహం జూలు దులిపే ఆవులించింది %-% అనే శుద్ధవచనాన్ని నరాలు తెగే కవిత్వంగా మార్చే రహస్యం తెలిసినవాడు %-%అతనొక్కడే!

మహాప్రస్థానము, ఖడ్గసృష్టి మాత్రమే రాసి శ్రీశ్రీ చేతులు దులుపుకోలేదు. సిరిసిరిమువ్వలు, ప్రాసక్రీడలు, లిమరిక్కులు, గల్పికలు, అనువాదాలు, నాటికలు, కథలు, వీలునామా, సినిమా పాటలు, ఆత్మకథ 'అనంతం' %-% మరెన్నో రాశాడు. అద్భుతాలు చేశాడు. జీవితాంతమూ రాస్తూనే ఉన్నాడు. ఎంత రాశాడో అంతకు మించి చదువుకున్నాడు. శ్రీశ్రీ జ్ఞాని. రుషితుల్యుడు. కష్టజీవు లందరికీ మిత్రుడు. తెలుగుజాతి వరపుత్రుడు.

దేవరకొండ బాలగంగాధర తిలక్ అమృతం కురిపించినా, వెలుతురెక్కడ సోనియా అంటూ బైరాగి విలపించినా, చెట్లు కూలుతున్న దృశ్యాన్ని చూసి అజంతా కన్నీళ్లు పెట్టినాబీ జనంలో నడు, కాలాన్ని వెంటపెట్టుకు నడూ అని మక్దూమ్ మొహియుద్దీన్ పిలుపు ఇచ్చినా, సత్యమూర్తి చిరుగాలి సితారా సంగీతం వినిపించినాబీఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్‌బాబు వెలివాడల వేదనని కన్నీటి అక్షరాలుగా పరిచినా అది శ్రీశ్రీ తిరుగుబాటు వేదాంతానికి ఉత్తేజపూర్వకమైన కొనసాగింపు మాత్రమే.

గురజాడ వేంకట అప్పారావు పరిచిన వారసత్వపు వెలుతురు దారుల్లో శ్రీశ్రీ, ఎర్రకాంతుల ఇనోదయాన్ని డిస్కవర్ చేసి, నవ్య కవిత్వంతో నిండిన వేల పాలపుంతల్ని ప్రసాదిస్తే ఆ వెలుగు వెన్నెల జోడిలో ఆధునిక తెలుగు కవిత్వం మానవ జీవన మాధుర్య సౌందర్య తీరాలను తాకి పరవశిస్తోంది.

# పనుల్లో రాజధాని ఎక్స్‌ప్రెస్!



**అమరావతి జూన్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. రాత్రీపగలు అని తేడా లేకుండా కార్మికులు, అధికారులు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల తుప్పుపట్టి నేలచూపులు చూసిన ఇనుప చువ్వలు.. కూటమి వచ్చిన ఏడాదిలోనే భవన నిర్మాణాలై తలెత్తుకొని నిల్చుంటున్నాయి. నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలు, రహదారుల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రాత్రిళ్లు రాజధాని వైపు చూస్తే.. విద్యుత్తు వెలుగుల్లో యంత్రాలతో పోటీపడుతూ పనులు చేస్తున్న కార్మికులను చూడొచ్చు.



# నెతన్యాహు (ఇజ్రాయెల్ ప్రధాని) రాయని డైరీ

**యుద్ధాన్ని మొదట ప్రారంభించిన వారే శాంతి కోసం మొదట ప్రయత్నం చేసినవారు అవుతారు. అయితే వారికి నోబెల్ శాంతి బహుమతి వస్తుందా రాదా అన్నది నేనెప్పుడూ ఆలోచించని విషయం.**



వార్స్, ఆపరేషన్స్, బ్యాటిల్స్... ఇన్నిటితో ఎన్నేళ్ల యుద్ధం చేసినా శాంతి సిద్ధిస్తుందని చెప్పలేం. శాంతిని కోరుకునేవారు నిరంతరం యుద్ధయజ్ఞం చేస్తూనే ఉండాలి. శాంతిని కాపాడుకుంటూ ఉండటమే శాంతి స్థాపన.

శుక్రవారం, తెల్లారకుండానే 200 యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ ఇరాన్‌తో శాంతి ప్రయత్నాలు ప్రారంభించింది. ఏవైనా రెండు దేశాలు టేబుల్ ముందు ఎదురెదురుగా కూర్చొని శాంతి కోసం జరుపుకొనే చర్చల కంటే %-% ఎవరి దేశంలో వారు, ఎవరి 'వార్ రూమ్'లో వారు కూర్చొని శతఘ్నులను ఒకరి వైపు ఒకరు విసురుకోవటం వల్లనే ఎప్పటికైనా శాంతిని సాధించగలమని నా నమ్మకం.

శాంతి కోసం జరిగే చర్చలు ఎంత వికారంగా ఉంటాయో చూడండి. చర్చలకు కూర్చున్నాక కదా కండిషన్స్ అనేవి! అసలు చర్చలకు కూర్చోటానికే కండిషన్స్ పెట్టేస్తారు! శాంతి కోసమా చర్చలు? లేక, మా నుదుటి మీద మేము పిస్టల్ గురి పెట్టుకుని కాల్చుకోవటం కోసమా?!

చర్చలకు ముందు చర్చలు. సంప్రదింపు లకు ముందు సంప్రదింపులు. రాయబారా లకు ముందు రాయబారాలు. రాకపోకలకు ముందు రాకపోకలు. ఈ మధ్యలో శాంతి ఎక్కడో చేజారి జారిపోతుంది.

ఇంటర్నల్ కేబినెట్ మీటింగ్స్‌లో నా కొలీగ్స్‌తో నేనిదే చెబుతాను. "చూడండి, నాకేం కావాలన్న దానిపై నాకు క్లారిటీ ఉంది. నాకు శాంతి ప్రక్రియలు అవసరం లేదు. శాంతి ఫలితాలు కావాలి" అని అంటాను.

శాంతి కోసం ఐక్యరాజ్య సమితి చేసే ప్రయత్నాలైతే పరమ పావనంగా ఉంటాయి! గడాఫీని తీసుకెళ్లి 'యూఎన్ హ్యూమన్ రైట్స్'కి చైర్మన్‌గా కూర్చోబెడుతుంది. సద్దాం హుస్సేన్‌ని పిలిపించుకుని 'యూఎన్ నిరాయుధీకరణ'కు అధ్యక్షుడిని చేస్తుంది. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తుంటే "తప్పు కదా మిత్రమా", "తగదు కదా నా ప్రియ దేశమా!" అంటోంది.



యూఎన్‌కు నేను ఒకటే చెబుతాను. "మీరు 'పీస్ టాక్స్'తో చేయలేని పనిని మేము 'పీస్ ఎటాక్స్'తో చేస్తున్నాం" అని! ఇంకొకటి కూడా చెబుతాను. ఇరాన్ అణ్వాయుధాలను పోగు చేసుకుంటోంది. ఆ పోగు నిన్న ఉన్నట్లుగా నేడు లేదు. వారం క్రితం ఉన్నట్లుగా నిన్న లేదు. నెల క్రితం ఉన్నట్లుగా వారం క్రితం లేదు. ఏడాది క్రితం ఉన్నట్లుగా నెల క్రితం లేదు. పోగు కుప్ప అయింది. కుప్ప గుట్ట అయింది. గుట్ట దిబ్బ అయింది. ఆ దిబ్బ ఇప్పుడు ఇజ్రాయెల్‌కు థ్రెట్ అయింది.

నా ప్రశ్న ఒక్కటే %-% ఇరాన్‌కు రెడ్ లైన్స్ గీసేందుకు నిరాకరించే వారికి, ఇజ్రాయిల్ ముందు రెడ్ లైట్ పెట్టే నైతిక హక్కు ఉంటుందా? అని. అనేక విషయాల్లో నన్ను తప్పుపట్టే ప్రపంచానికి అనేకానేక విషయాల్లో నేను కరెక్ట్ అనీ తెలుసు. కానీ ఒప్పుకోదంతే! ఏదైనా దేశం 'రాక్ బాటమ్'కి చేరుకుందంటే ఇక అక్కడేం మిగల్లేదని అర్థం.

మంచీ చెడ్డ, నీతీ నియమం, ఆశా శ్వాస...ఏమీ మిగల్లేదని. అలాంటి దేశాన్ని కలుపుకోనన్నా కలుపుకోవాలి. లేదా యుద్ధ ట్యాంకుల్ని పెట్టి కలుపునైనా ఏరి పారేయాలి. హఠాత్తుగా భారీ విస్ఫోటనం! జెరూసలేంలో నేనున్న గది ఒక్కసారిగా దద్దరిల్లింది. కిటికీ అద్దాలు బద్దలయ్యాయి. సమీపంలో %-% "కొడుకా... నాయనా..." అని ఓ తల్లి ఆక్రందన! ఇరాన్ నుంచి ఖొమైనీ తిరుగుయుద్ధం ప్రారంభించినట్లున్నాడు.

ఇజ్రాయెల్ మాత్రం యుద్ధాన్ని ఆపదు. ఒక తల్లి తన పిల్లల్ని ఏ ఉదయమైనా నిర్భయంగా బయటికి పంపగలిగేంతైనా శాంతిని నెలకొల్పేవరకు ఇజ్రాయెల్ తన యుద్ధాన్ని ముగించదు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

SPORTS NEWS

https://epaper.teluguraastram.com

అమలాపురం
జూన్ 16,
సోమవారం 2025



# గిల్ ఎక్కడ మెరుగవ్వాలంటే..?

## గంగూలీ సూచనలివే..

ఇంటర్నెట్‌డెస్క్:

ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. కొత్త సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వం వహిస్తుండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అయితే.. కెప్టెన్‌గా గిల్ కొత్త పాత్ర, ఎదురయ్యే సవాళ్లపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విశ్లేషించాడు.



తన కెప్టెన్సీ హయాంలో ఎంతో మంది యువ ఆటగాళ్లను ప్రోత్సహించిన గంగూలీ.. శుభ్‌మన్ గిల్ సామర్థ్యాలపై విశ్వాసం వ్యక్తం చేశాడు. అయితే, అదే సమయంలో పలు సూచనలు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో సాంకేతికంగా మెరుగవ్వాలని పేర్కొన్నాడు. "గిల్‌కు ఆల్ ది బెస్ట్. టెస్టుల్లో అతడు బాగా రాణిస్తాడన్న నమ్మకం ఉంది. అతడు టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్. ఇక జట్టులో సీనియర్లు అయిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రహానె లేరు. టీమ్‌ఇండియాలో పరిస్థితులు మారిపోయాయి" అని దాదా పేర్కొన్నాడు.

**విజయానికి చేరువకాగానే ఆసీస్ మాపై స్లెడ్జింగ్‌కు దిగింది: బవుమా**

ఇంగ్లండ్‌లో సవాల్ విసిరే పరిస్థితుల్లో గిల్ కెప్టెన్‌గానూ, బ్యాటర్‌గానూ రాణించాలన్నాడు. పరిస్థితులకు తగ్గట్లు ఆటతీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. "ఇంగ్లండ్‌లో బంతి స్వింగ్, సీమ్ అవుతున్న పరిస్థితుల్లో గిల్ ఎక్కువ పరుగులు సాధించాలి. కొత్త బంతితో ఆడటం ఆరంభంలో కష్టంగానే ఉంటుంది. 100/2 లేదా 20/4.. ఇలాంటి పరిస్థితుల్లో బ్యాటింగ్ చేయడం ఎప్పుడూ భిన్నంగానే ఉంటుంది. సరైన డిఫెన్స్ ఎంచుకోవాలి. ఆఫ్ స్టంప్ ఆవల పడ్డ బంతులను ఎలా వదిలేయాలో నేర్చుకోవాలి" అని గంగూలీ సూచించాడు.

ఇంగ్లండ్‌లోని పిచ్‌లపై ఫ్రంట్ ఫుట్ అప్రోచ్‌ను మెరుగుపరుచుకోవాలని గంగూలీ సూచించాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో పని చేసే బ్యాక్ ఫుట్ అప్రోచ్‌కు ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉంటాయని వివరించాడు. ఇక ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 20 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ లీడ్స్ వేదికగా జరగనుంది.

# జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కే అధిక ప్రాధాన్యత ఇచ్చారు..

## ఆసీస్ ఓటమిపై మండిపడ్డ మాజీ

ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఆస్ట్రేలియా ఓటమి పాలైంది. దీంతో వరుసగా రెండో సారి డబ్ల్యూటీసీ గదను అందుకోవాలనుకొన్న ఆ టీమ్‌కు నిరాశే ఎదురైంది. ఈ ఓటమి నేపథ్యంలో ఎక్కడ పొరపాట్లు జరిగాయో ఆ జట్టు మాజీ ఆటగాళ్లు విశ్లేషిస్తున్నారు. ఆ జట్టు మాజీ మిచెల్ జాన్సన్ ఒక అడుగు ముందుకేసి పలువురు ఆటగాళ్ల తీరుపై మండిపడ్డాడు. జట్టు ప్రయోజనాలకంటే.. ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించాడు.




**విజయానికి చేరువకాగానే ఆసీస్ మాపై స్లెడ్జింగ్‌కు దిగింది: బవుమా**

మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, నాథన్ లైయన్‌తో కూడిన బౌలింగ్ 'బిగ్ ఫోర్' విఫలమైందని మిచెల్ జాన్సన్ అభివర్ణించాడు. ముఖ్యంగా హేజిల్‌వుడ్ తీరుపై తీవ్ర విమర్శలు చేశాడు. "ఇటీవల కాలం హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్‌పై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అతడు జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. వాయిదా పడ్డ అనంతరం ప్రారంభమైన ఐపీఎల్‌కు తిరిగి వెళ్లాలన్న అతడి నిర్ణయం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇక లైయన్ వికెట్లు తీయడంలో విఫలమయ్యాడు" అని విమర్శించాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై ఐదు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంతో 27 ఏళ్ల తర్వాత తొలిసారి ఐసీసీ టైటిల్‌ను ఆ జట్టు చేజిక్కించుకుంది.

# అదే నాలో స్ఫూర్తి నింపింది..

## ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసింది: మార్క్రమ్

డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది దక్షిణాఫ్రికా. 27 ఏళ్ల అనంతరం ఆ జట్టు ఐసీసీ టైటిల్‌ను గెలిచింది. ఈ విజయం ఆ జట్టు ఆటగాళ్లతోపాటు అభిమానులకూ ఎంతో భావోద్వేగంతో కూడినదే. చివరి దాకా వచ్చి.. ఒత్తిడికి తలొగ్గే అలవాటున్న ఆ జట్టు ఈ సారి మాత్రం పట్టువిడవలేదు. ఆ జట్టు విజయంలో సెంచరీతో కీలకంగా నిలిచిన మార్క్రమ్ కూడా అదే చెప్పాడు. ఈ సారి టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదనే లక్ష్యంతో ఆడినట్లు వెల్లడించాడు.



గత టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియాపై ఓటమి దక్షిణాఫ్రికాను తీవ్రంగా కుంగదీసిన విషయం తెలిసిందే. అప్పుడు తాను ఔట్ అయిన తర్వాత.. ఎంతో నిరాశకు గురయ్యానని.. మళ్లీ అలాంటి ఫీలింగ్ ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో రాకుడదని కోరుకున్నానని మార్క్రమ్ తెలిపాడు. ఆ ఆలోచనే తనలో స్ఫూర్తి నింపిందని.. వీలైనంత ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసిందని పేర్కొన్నాడు.

తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన మార్క్రమ్.. రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. "డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. గత టీ20 ప్రపంచకప్‌లో ఓటమి గురించి నేను చాలా ఆలోచించాను. టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఔట్ అయిన తర్వాత నేను ఒంటరిగా కూర్చుని ఎంతో నిరాశకు గురయ్యాను. మరోసారి అలాంటి పరిస్థితి రాకూడదని నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచనే నాలో స్ఫూర్తినింపింది. అందుకే ఎక్కువ సేపు క్రీజులో ఉండగలిగాను"


విజయానికి చేరువకాగానే ఆసీస్ మాపై స్లెడ్జింగ్‌కు దిగింది: బవుమా

"ఇక సెంచరీ సాధించిన తర్వాత నేను చాలా భావేద్వేగానికి గురయ్యాను. జట్టు విజయం కోసం పోరాడుతున్నందుకు కన్నీళ్లు కూడా వచ్చాయి. ఇక చివరి రోజు జట్టు విజయానికి 69 పరుగుల దూరంలో ఉన్నప్పుడు.. అంతకుముందు రోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు. నిద్ర మాత్రలు తీసుకోవడానికి కూడా ప్రయత్నించాను. కానీ నాకు విశ్రాంతి దొరకలేదు. నా మనసు నిండా ఏవేవో ఆలోచనలు. అయితే.. చివరి రోజు మేం విజయం సాధించాం" అని మార్క్రమ్ భావోద్వేగానికి గురయ్యాడు.

# వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ షెడ్యూల్ విడుదల..

## భారత్ ఎన్ని మ్యాచులు ఆడనుందంటే..?




సౌతాఫ్రికా 2023-25 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలిచిన వెంటనే ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ 2025-27 సైకిల్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం తొమ్మిది జట్లు కలిసి మొత్తం 71 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనున్నాయి. 2025 జూన్ 17న శ్రీలంకలోని గాలే వేదికగా శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య తొలి మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఇక ఈసారి ఎక్కువ మ్యాచ్‌లు ఆడే జట్లలో ఆస్ట్రేలియా (22 టెస్టులు), ఇంగ్లాండ్ (21 టెస్టులు) ముందు వరుసలో ఉన్నాయి. ఈ ఏడాది చివర్లో ఈ రెండు జట్ల మధ్య ఆస్ట్రేలియా వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య యాసిస్ సిరీస్ జరగనుంది.

ఇకపోతే భారత జట్టు తన క్యాంపెయిన్‌ను జూన్ 20న ఇంగ్లాండ్‌తో లీడ్స్ వేదికగా మొదలుపెట్టనుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా మొత్తం 18 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో ఎక్కువ భాగం హోమ్ మ్యాచ్‌లే కావడం విశేషం. ఇందులో టీమిండియా షెడ్యూల్ చూస్తే.. ఇంగ్లాండ్‌తో 5 టెస్టులు, వెస్టిండీస్‌తో 2 టెస్టులు, దక్షిణాఫ్రికాతో 2 టెస్టులు, ఆస్ట్రేలియాతో 5 టెస్టులు, శ్రీలంకతో 2 టెస్టులు, న్యూజిలాండ్‌తో 2 టెస్టులు జరగున్నాయి.

గత సైకిల్‌లో టీమిండియా మూడో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే ఈసారి ఎక్కువ మ్యాచ్‌లు ఇండియా సొంతగడ్డపై ఉండటంతో విజయం సాధించే అవకాశం అధికంగా ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో గత పరాజయానికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం లేకపోలేదు. ప్రస్తుత ఛాంపియన్ సౌతాఫ్రికా, అక్టోబరులో పాకిస్తాన్‌లో టెస్ట్ సిరీస్‌తో తన మొదటి గేమ్ ను ప్రారంభిస్తుంది. అయితే 2026 సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే మూడు టెస్ట్‌ల సిరీస్ కోసం వారి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఈ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఆస్ట్రేలియా (22 టెస్టులు), ఇంగ్లాండ్ (21 టెస్టులు) అత్యధిక మ్యాచ్‌లు ఆడతాయి. ఆ తర్వాత టీమిండియా 18 టెస్ట్ మ్యాచ్‌లు, న్యూజిలాండ్ 16 టెస్టులు, వెస్టిండీస్ 14 టెస్టులు, దక్షిణాఫ్రికా 14 టెస్టులు, పాకిస్తాన్ 13 టెస్టులు, శ్రీలంక 12 టెస్టులు, బంగ్లాదేశ్ 12 టెస్టులు ఆడనున్నాయి.2

# ప్రీతీ షాకింగ్ నిర్ణయం

## ఆ ముగ్గురు ఔట్

2025 ఐపీఎల్ ఫైనల్ లో భాగంగా ఆర్సీబీ పంజాబ్ కింగ్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో ఆర్సీబీ విజయం సాధించి తొలిసారి ఛాంపియన్ గా నిలిచింది. చివరివరకు జరిగిన ఉత్కంఠపోరులో పంజాబ్ తొలి టైటిల్ కోసం పోరాడి ఓడింది.



ఈ ఓటమితో ఫ్రాంచైజ్ ఓనర్ ప్రీతిజింటా ముగ్గుర్ని ఎలిమినేట్ చేసేందుకు సిద్ధమైందట. భారీ ధరకు కొనుగోలు చేసిన ఆటగాళ్లు ఎవరు? వాళ్ళ ప్రదర్శన ఎలా ఉంది? వచ్చే వేలంలో అనుసరించాలని వ్యూహాలపై ప్రీతి ఇప్పటినుంచే లెక్కలు వేసుకుంటుందట.

వచ్చే సీజన్లో టైటిలే లక్ష్యంగా జట్టుని సంసిద్ధం చేయాలనుకుంటుంది. అందులో భాగంగా కొందర్ని వేలంలోకి వదిలేసి, మ్యాచ్ విన్నర్లను జట్టులోకి తీసుకోవాలనుకుంటుంది. ఆస్ట్రేలియన్ స్టార్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్‌ను పంజాబ్ 11 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ స్టోయినిస్ ఆ స్థాయి ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. ఆడిన 13 మ్యాచ్‌ల్లో 186 స్ట్రైక్ రేట్ తో 160 పరుగులు చేశాడు. అతనిపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ స్టోయినిస్ ఆకట్టుకోలేదు. దీంతో వచ్చే వేలంలో స్టోయినిస్ ను వేలంలోవదిలేసేందుకు ప్రీతిజింటా సిద్ధమైనట్లు తెలుస్తుంది. పంజాబ్ కింగ్స్ విడుదల చేయాలనుకుంటున్న ఆటగాళ్లలో ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్వెల్ ఉన్నాడు.

మాక్సీని పంజాబ్ 4 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ మ్యాక్స్ వెల్ ప్రీతిజింటాను మెప్పించలేకపోయాడు. 7 మ్యాచులు ఆడి 48 పరుగులు చేశాడు. అటు బౌలింగ్ పరంగా పెద్దగా సాధించిందేమీ లేదు. 7 మ్యాచుల్లో 4 వికెట్లు తీసుకున్నాడు. దీంతో మ్యాక్స్ వెల్ ని పంజాబ్ యాజమాన్యం వదిలించుకునే అవకాశం ఉంది. ఇక ఈ జాబితాలో ఫాస్ట్ బౌలర్ యశ్ ఠాకూర్ కూడా ఉన్నాడు. పంజాబ్ అతన్ని1.6 కోట్లకు కొనుగోలు చేసింది. ఠాకూర్ కి 2 మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం వచ్చింది. కానీ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదు. 12.15 ఎకానమీతో ఒక వికెట్ మాత్రమే తీశాడు. దీంతో ఠాకూర్ ను కూడా పంజాబ్ వదిలించుకోవాలనుకుంటుంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



## సాగర కన్య వయసు 50 కాదు 20

కొందరికి వయసు కేవలం నంబర్ మాత్రమే. అది ఎప్పటికీ ప్రభావితం చేయదు. మనసుండాలే కానీ ఆస్వాధనకు అసలు వయసుతో పనేంటి? ఇదిగో ఇక్కడ శిల్పా శెట్టి పరిణతి ఎప్పుడూ మనసులను గెలుచుకుంది. సాగరకన్యగా తెలుగు యువత గుండెల్లో కొలువు దీరిన శిల్పాజీ.. బిజినెస్‌మేన్ రాజ్ కుంద్రాను పెళ్లాడినప్పుడు చాలా గుండెలు ఆగిపోయాయి. కానీ ఆ జంట అన్యోన్య దాంపత్యం, ఇద్దరు పిల్లలకు మామ్ డాడ్ గా ఫ్యామిలీ లైఫ్ గోల్స్ ని ఫిక్స్ చేయడంలో ఎప్పుడూ విఫలం కాలేదు. ఎన్నో వివాదాలు.. అన్నిటిలో భర్త వెంటే శిల్పా శెట్టి. ఇటీవల సుదూర తీరాలకు వెకేషన్ కి వెళ్లిన శిల్పా శెట్టి రేర్ ఫోటో క్లిక్స్ ని షేర్ చేసింది. అయితే వీటిలో వైట్ అండ్ వైట్ టూపీస్ లో ఫోటోషఉట్ అభిమానులను ఎగ్జయిట్ చేస్తోంది. ఈ ఫోటోషఉట్‌లో శిల్పా శెట్టి నేటి తరానికి కూడా చెమటలు పట్టించే భంగిమలతో చెలరేగిపోయింది. బాలీవుడ్ యోగా క్వీన్ శిల్పా శెట్టికి వయస్సు కేవలం ఒక సంఖ్య మాత్రమే! ఈ బ్యూటీకి ఇప్పుడే 50 ఏళ్లు వచ్చాయి కానీ తన శరీరం 20 ఏళ్ల వద్దనే ఆగిపోయింది అంటూ అభిమానులు కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. వైట్ అండ్ వైట్ టూపీస్ లో శిల్పాజీ ఫోజులు యూత్ లో గుబులు పుట్టిస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే, ఇంతకుముందు రోహిత్ శెట్టి సింగం ఎగైన్‌లో కనిపించింది. ఓవైపు సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు శిల్పాశెట్టి డ్యాన్స్ రియాలిటీ షోలతో భారీగా ఆర్జిస్తోంది.



## సక్సెస్‌కు కొత్త భాష్యం చెప్పిన నటి సమంత!


**విజయం అంటే స్వేచ్ఛేనని స్పష్టం చేసిన సమంత**
**గతంతో పోలిస్తే ఇప్పుడే ఎక్కువ విజయవంతంగా ఉన్నానన్న నటి**
**దాదాపు రెండేళ్లుగా వెండితెరకు దూరంగా ఉన్న సమంత**
**ఇటీవల 'శుభం' సినిమాలో అతిథి పాత్రలో మెరిసిన వైనం**
**'మా ఇంటి బంగారం' చిత్రం ప్రకటన**



ప్రముఖ కథానాయిక సమంత తన దృష్టిలో విజయం అంటే స్వేచ్ఛను పొందడమేనని అన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం మరింత ఎక్కువ విజయాన్ని సొంతం చేసుకున్నట్టు భావిస్తున్నానని తెలిపారు. దాదాపు రెండేళ్ల విరామం అనంతరం సినిమాల్లో తన ప్రయాణం, వ్యక్తిగత ఎదుగుదల గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయం గురించి తన అభిప్రాయాన్ని వివరిస్తూ "విజయానికి నిర్వచనం ఏమిటని అడిగితే నేను వెంటనే స్వేచ్ఛ అని చెబుతాను. నిరంతరం అభివృద్ధి చెందడం, పరిణితి సాధించడం, దేనికీ బందీగా ఉండకపోవడమే నా దృష్టిలో నిజమైన స్వేచ్ఛ. అదే అసలైన విజయం" అని సమంత పేర్కొన్నారు. గత రెండేళ్లుగా తన సినిమా ఏదీ విడుదల కాకపోయినా, ఈ విరామ సమయంలో తాను ఎంతో స్వేచ్ఛగా ఉన్నానని ఆమె తెలిపారు. "బహుశా నా చుట్టూ ఉన్నవారు, గతంతో పోలిస్తే నేనిప్పుడు విజయం సాధించలేదని అనుకోవచ్చు. కానీ, నా వ్యక్తిగత దృష్టిలో మాత్రం నేను గతం కంటే ఎక్కువ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాను. నేను ప్రస్తుతం చేస్తున్న పనులు నాకు ఎంతో ఉత్సాహాన్నిస్తున్నాయి. వాటిని పూర్తి చేయడం కోసం ప్రతిరోజూ ఎంతో ఆనందంగా నిద్రలేస్తున్నాను" అని సమంత వివరించారు. సినిమాల విషయానికొస్తే సమంత పూర్తిస్థాయి ప్రధాన పాత్రలో కనిపించి దాదాపు రెండేళ్లు కావొస్తోంది. ఇటీవల విడుదలైన 'శుభం' చిత్రంలో ఆమె మాతాజీ అనే ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అంతేకాకుండా, ఈ సినిమాతో సమంత తొలిసారిగా నిర్మాణ రంగంలోకి కూడా అడుగుపెట్టారు. ఇప్పుడు 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సినిమా షఉటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుందని సమాచారం. త్వరలోనే మరిన్ని వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తానని సమంత ఇటీవల అభిమానులకు హామీ ఇచ్చారు.

### గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం వారిపై

## ఆగ్రహం వ్యక్తం చేసిన దిల్ రాజు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ అవార్డుల స్వీకరణలో సినీ పరిశ్రమ తీరుపై ఎఫ్ డిసి ఛైర్మన్ దిల్ రాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల కోసం ఆరు నెలలుగా కష్టపడితే సక్సెస్ అయిందని తెలిపారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో దిల్ రాజు మాట్లాడారు. ప్రభుత్వం అవార్డులు ఇస్తుందంటే అందరూ హాజరై తీసుకోవాలని సూచించారు. అవార్డుల తేదీ ప్రకటించాక ఆ తేదీన అందరూ అవార్డు కోసం సమయం కేటాయించాలన్నారు. ఇంత పెద్ద ఈవెంట్లో ఏవైనా పొరపాట్లు జరిగితే క్షమించాలని ఎఫ్డిసి ఛైర్మన్ దిల్ రాజు కోరారు. 2024 సినిమాలకే ఇవ్వాలని ప్లాన్ చేశామని, కానీ 2014 నుంచి ఇప్పటివరకు అవార్డులు ఇవ్వకపోవడంతో గత పది సంవత్సరాలకు సంబంధించిన సినిమాలకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతి సంవత్సరం మూడు ఉత్తమ చిత్రాలకు అవార్డులు ఇచ్చేందుకు కమిటీ నిర్ణయం తీసుకుందని దిల్ రాజు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్న వారు చాలా సంతోషంగా ఉన్నారని, గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం కోసం మార్గనిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.


## జులైలో ఆఫ్రికా అడవులకు 'మహారాజ్'

మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకుడు రాజమౌళి తీస్తున్న చిత్రం పనులు స్పీడ్ అందుకున్నాయి. కొద్దిరోజుల క్రితం ఒడిసాలో చిత్రీకరణ జరుపుకున్న ఈ భారీ ప్రాజెక్ట్ అక్కడ కొన్ని కీలక సన్నివేశాలతోపాటు, యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్ర యూనిట్ ఇప్పుడు ఆఫ్రికాలోని అటవీ ప్రాంతాల్లోకి వెళ్లనుంది. కథ రీత్యా ఈ సినిమాలోని అత్యంత కీలకమైన చిత్రీకరణలు ఇక్కడ షఉట్ చేయనున్నారు. జులైలో కెన్యాకు చిత్ర యూనిట్ పయనం కానుంది. మసాయి-పిగ్మీస్ తెగలతో ఇప్పటికే మహేశ్‌బాబు కొద్దిరోజులు గడిపారు. ఆ ప్రాంతపు యుద్ధ విద్యలపై బేసిక్ స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్టుగా సమాచారం. దాదాపు 30రోజుల పాటు జరగనున్న షఉటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది చిత్ర యూనిట్. అక్కడి ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్‌లో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లుగా తెలుస్తోంది. కెన్యాలో జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రియాంక చోప్రా సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. మహేశ్‌తోపాటుగా పృథ్వీరాజ్ సుకుమార్‌తో పాటు మరికొందరు అక్కడ షఉటింగ్‌లో పాల్గొననున్నారు. ఇక ఈ సినిమాకు 'మహారాజా', 'మహారాజ్' అనే టైటిల్స్‌ను అనుకుంటున్నారని ఇండిస్ట్రీలో చర్చ జరుగుతోంది. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.



## 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు'.. మనసుకు హత్తుకునేలా '8 వసంతాలు' ట్రైలర్

'మ్యాడ్' మూవీ ఫేం అనంతిక సానిల్ కుమార్ ప్రధానపాత్రలో తెరకెక్కిన్న సినిమా '8 వసంతాలు'. డైరెక్టర్ ఫణింద్ర రూపొందించిన ఈ మూవీ ట్రైలర్ కొద్దిసేపటిక్రితమే విడుదలైంది. ఇందులో విజువల్స్ నాచురల్ గా, అద్భుతంగా ఉన్నాయి. 'ప్రేమ జీవితంలో ఒక దశ మాత్రమే.. అదే దిశ కాదు', 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు ఉన్నాయి.. ఆడదాని ప్రేమకు ఏముంటాయి, మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప' వంటి డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. బ్యూటీఫుల్ లవ్ స్టోరితోపాటు ఎమోషన్, యాక్షన్ సన్నివేశాలతో వదిలిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. టాలీవుడ్ లో అతి తక్కువ సమయంలోనే పెద్ద నిర్మాణ సంస్థగా పేరు తెచ్చుకున్న మైత్రీ మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## 'రాజాసాబ్' టీజర్ లోడింగ్..

## భయపడుతున్న హీరోయిన్స్



సలార్ మూవీ తర్వాత ప్రభాస్ నుంచి వస్తున్న సినిమా 'రాజాసాబ్'. డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న 'రాజాసాబ్' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో జూన్ 16న టీజర్ ను వదులుతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఈ టీజర్ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఆదివారం ఈ మూవీ ప్రీ టీజర్ ను మేకర్స్ వదిలారు. ఇందులో.. చీకటిగా ఉన్న ఓ ప్యాలెస్ లోకి వచ్చిన ముగ్గురు హీరోయిన్లు భయంగా పైకి చూస్తున్నారు.. తర్వాత టీజర్ లోడింగ్ అవుతున్నట్లు చూయించారు. రేపటి నుంచి రెబల్ వైబ్ స్టార్ట్ అని మేకర్స్ పోస్ట్ చేశారు. రేపు ఉదయం 10.25 గంటలకు టీజర్ రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. రొమాంటిక్ హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. రేపు హైదరాబాద్‌లో గ్రాండ్ టీజర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, తొలిసారి ప్రభాస్.. హారర్ కామెడీ చేస్తుండటంతో ఆయన ఫ్యాన్స్ తోపాటు సనీ ప్రేక్షకులు 'రాజాసాబ్' పై ఆసక్తిగా ఉన్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339